# 'అధ్యాత్మవిద్యా విద్యానాం'

**చదువుల్ నేర్చితినంచు గర్వము వహించన్‌రాదు నీకున్న యా**
**చదువేపాటిది, విద్యకున్ వినయమే సద్రూపమౌ, నేర్వద**
**గ్గది యెంతో కలదంచు గర్వదురహంకారమ్ములన్ బాయుడీ**
**హృది దానన్ తలపోయుచుండు సుగతీ! ఓయీ అవిద్యాపతీ!**

ప్రేమస్వరూపులారా!

ఈనాడు ఆలోచించగల ప్రతి మానవుని అయోమయ స్థితిలో ముంచెత్తే సమస్యలు విద్యారంగమునందు విరివిగా పెరుగుచున్నవని విజ్ఞులైనవారు మాత్రమే గుర్తించటానికి ప్రయత్నిస్తున్నారు. జీవితమునకు సంబంధించిన ప్రతి రంగమును పుష్టివంతముగానూ, ప్రయోజనవంతముగాను తీర్చిదిద్దవలసిన శక్తి సామర్థ్యములు జాతి పౌరులకందివ్వవలసిన విద్యార్థులు యీనాడు తమ తత్వాన్ని తాము విస్మరిస్తున్నారు. మంచి విద్యార్థులకు, పవిత్రమైన హృదయము కలవారికి జ్ఞానబోధ చేయనక్కరలేదు. అట్టివారికి చేయుటకూడను చాలా సులభము. ఎట్టి జ్ఞానము లేని మూర్ఖునకు జ్ఞానబోధ చేయటము అత్యంత సులభము. కానీ అటు పూర్ణజ్ఞానులుకాక, యిటు పూర్ణ అజ్ఞానులుకాక మధ్యస్థితిలో వుండినవారికి చెప్పటము ఎవ్వరి తరము కాదు.

**మేను మరచి నిదురించేవారిని మేలుకొలుపగలరెవరైనా**
**కనులు మూసుకుని నిదుర నటించే ఘనుని**
**లేపగా ఎవరితరము!**
**జాలమేలోయి! యిక లీలలు చాలోయి!**

మైమరచి నిద్రించేవానిని సులభంగా లేపవచ్చును. మేలుకొని నిద్రించినట్టుగా నటించేవానినికూడను కొంత కష్టంగా లేపవచ్చు. కాని, గాఢనిద్రగా వుండినట్లు భావిస్తూ

srisathyasaivachanamrutam

నటన చేసేవానిని ఎవ్వరూ లేపలేరు. స్వామి కావలెనని, స్వామియొక్క ఆశయాలు ఆచరణరూపకంగా అందించాలని వున్నవారికి ప్రత్యేక బోధలు చేయనక్కరలేదు. 'స్వామి చెప్పినవన్నీ మా మంచికోసమే, విద్యార్థుల క్షేమంకోసమే జగత్కళ్యాణము కోసమే, మన సమాజముయొక్క అభివృద్ధికోసమే,' అనే సంకల్పము గాఢముగానున్న విద్యార్థులకు బోధించనక్కరలేదు. స్వామి తత్త్వమే ఎరుగనివారికికూడను సులభంగా బోధించవచ్చును. కానీ, స్వామి తత్త్వము తెలిసినట్టుగా నటిస్తూ అన్నీ తెలుసుకున్నవారివలె సంభాషణలు సల్పుతూ, వారి ప్రవర్తనలోకూడా తెలిసినట్టుగా నటించుచూ, యేమీ తెలుసుకోటానికి ప్రయత్నించని మూర్ఖులకు చెప్పటం చాలా కష్టం.

**ఆధ్యాత్మిక విద్య సాగరమువంటిది**

విద్యార్థులు మొట్టమొదట వాక్యముయొక్క విలువను చక్కగా గుర్తించాలి. తదుపరి మనసుయొక్క ప్రభావాన్ని చక్కగా గమనించాలి. హృదయముయొక్క విశాలతనుకూడా బాగుగా గుర్తించాలి. యీ మూడింటిని శ్రద్ధా, భక్తులతో గుర్తించినప్పుడు వారిలో ఎట్టి దోషములు ప్రవేశించుటకు వీలుండదు. యీ హృదయమును, మనస్సును, వాక్కును గుర్తింపచేయునదే ఆధ్యాత్మికము. దృశ్యకల్పితమై కనుపించునది, వినిపించునది, అనిపించునిది, మురిపించునిది యివంతయుకూడను కేవలము జగత్తు. ఇట్టి జగత్తును గురించి ప్రబోధించునదే విద్య. యీ Physics అనండి, Maths అనండి, Chemistry అనండి, Bio science అనండి, ఏదికూడను వున్న జగత్తును మాత్రమే విపులంగా విడదీసి బోధించటమే! కనుపించనిదానిని, వినిపించనిదానిని, మనస్సును మురిపించే దానిని ప్రబోధించేదే ఆధ్యాత్మికము. యీ ప్రాకృతమైన సమస్త విద్యలు ఆధ్యాత్మికమునుండి ఆవిర్భవించినవి. ఎట్లనగా 'నదీనాం సాగరో గతిః'. 'అధ్మాత్మవిద్యా విద్యానాం' అన్ని విద్యలందు ఆధ్యాత్మిక విద్య ప్రధానమైన విద్య. యిదే ఘనమైన విద్య, ఉన్నతమైన విద్య అని వేదాంతము ప్రబోధిస్తూ వచ్చింది. అన్ని నదులుకూడను కడపటికి సముద్రమును చేరునవే! ఈ లౌకిక విద్యలన్నియు ఒక్కొక్కటి ఒక్కొక్క నదివంటిది. ఆధ్యాత్మిక విద్య సాగరమువంటిది. ఈ విద్యలన్నియు ఎక్కడినుంచి వచ్చినవో తిరిగి అక్కడకు పోయి చేరాలి. అట్లుకాక మధ్య

srisathyasaivachanamrutam

మధ్య ఏదో తనకు అవసరమైన దాంట్లో యీ విద్య నిల్చిపోయిందంటే యిది పూర్ణత్వము కానేరదు.

## సముద్రమనే భగవదనుగ్రహమునుండి ఆవిరిగా మారినదే ఆధ్యాత్మికము

సముద్రజలము సూర్యకిరణములచేత ఆవిరిగా మారుచున్నది. యీ ఆవిరియే మేఘములుగా రూపొందుచున్నది. యీ మేఘములనుండియే వర్షములు కురియుచున్నవి. ఈ వర్షములనుండియే వాగులు, వంకలు పారుచున్నవి. ఇవియే నదిగా రూపొందుచున్నవి. ఈ నది పెద్దదిగా ప్రవహించి చివరకు సముద్రములో చేరుచున్నది. ఈ తత్త్వాన్ని మనము చక్కగా గుర్తించుకుంటే, సముద్రమునుండే పుట్టి అనేక రూపనామములు ధరించి అనేక మార్గములలో ప్రవహించి కడపటికి తిరిగి సముద్రమునందే లయమగుచున్నది. కనుక, సముద్రమునుండి ఆవిరిగా మారినటువంటిదే ఆధ్యాత్మికము. సముద్రమే అనుగ్రహము. సముద్రమనే అనుగ్రహమునుండి ఆవిరిగా మారినదే ఆధ్యాత్మికము. కనుక, యీ ఆధ్యాత్మికమనే మేఘములలో నిండిన సత్యమే జలము. ఈ సత్యమనే మేఘములనుండి ప్రేమ బిందువులుగా క్రిందపడుతున్నాది వర్షము. ఈ ప్రేమ బిందువులుగా వర్షించిన జలమే ఏకముగా చేరుచున్నది. అదియే సత్సంగము. ఈ సత్సంగముయొక్క ప్రభావము క్రమక్రమేణా మరింత సత్సంగముగా మారటంచేత అదే ఆనందమనే ప్రవాహంగా రూపొందుతున్నాది. ఈ ఆనందమనే ప్రవాహము తిరిగి అనుగ్రహమనే సాగరములో చేరిపోతుంది. అనుగ్రహమునుంచి పుట్టినటువంటిది అనేక రూపనామములు దాల్చి పరిస్థితుల ప్రభావములను పురస్కరించుకొని తిరిగి ఆనందమనే రూపముతో ఆనందమనే సాగరమును చేరుతున్నాది. ఆనందముతో అనుగ్రహాన్ని పొందిన జలమే పరిపూర్ణజలము. అట్టి ఆనందము లేకుండా విచారముగానో, దుఃఖముగానో, అశాంతిగానో తిరిగి సముద్రములో చేరుతున్నాదంటే అది సరైన నది కాదు. అయితే యీనాడు మేఘములనుండి కురిసిన వర్షము ఏ గుట్టపైనో, మిట్టలపైనో, మరుభూములందో కురిసి అక్కడికక్కడే నిల్చి పోతున్నాది, యింకి పోతున్నాది.

sri sathyasai vachanamrutam

కారణమేమిటి? ప్రేమ అనే బిందువులు తిరిగి సత్సంగము అనే ఏకత్వములో చేరకపోవటంచేత యీ విధమైన దురవస్థలకు గురైపోతున్నాది. కొంత కొంత వర్షము మాత్రమే సత్సంగముగా రూపొందుతున్నాది. అనగా ఏకమైపోతున్నాది. ప్రవాహములుగా ప్రవహిస్తున్నాయి. కానీ యే టాంకులలోనో పడిపోతున్నాయి. సముద్రానికి చేరటం లేదు. ఏ జలము పవిత్రమైన ఆరాటంచేతను, పవిత్రమైన భక్తి, ప్రపత్తులచేతను ప్రవహించునో ఆ జలము మాత్రమే దైవ అనుగ్రహములో యేకమైపోతున్నది. సత్యస్వరూపాన్ని ధరించినది, ఒక సబ్జెక్ట్. ప్రేమగా ప్రవహించుతత్త్వముకూడను ఒక సబ్జెక్టే. సత్సంగముగా మార్చుకొనేవికూడను ఒక సబ్జెక్టే. యివన్నీకూడను యీనాడు మీరు చదివే ఫిజిక్సు, కెమిస్ట్రీ, బోటనీ, మేత్స్, యిలాంటి సబ్జెక్ట్స్. అయితే యివన్నీ పోయి ఏదో ఒక ట్యాంకులో పడి యిమిడిపోతున్నాయేగాని సముద్రములో పోయి చేరటంలేదు. ఏ అదృష్టవంతుడో యే పవిత్ర హృదయము కలవాడో ఏ సంపూర్ణమైన విశ్వాసము కలవాడో ఐన ఒక్కరి ఆనందము మాత్రమే భగవదనుగ్రహము అనే సాగరములో చేరిపోతున్నాది.

**విద్యాసంస్థలందు ఆధ్యాత్మిక భావము, నైతిక ప్రవర్తన, ధార్మిక విచారము సన్నగిల్లటంచేత ప్రపంచము యింత అల్లకల్లోలములకు గురవుతున్నది**

స్వామి అనుగ్రహానికి పాత్రులు కావాలని, స్వామికి సమీపులు కావాలని, స్వామి దయకు గురికావాలని ఆశిస్తున్నారేకానీ, ఆ ఆశకు తగిన ప్రయత్నముగానీ, ప్రవర్తనగానీ, జరగటంలేదు. దేనికి తగిన క్రమశిక్షణ దానికొరకు అనుసరించాలి. ఆ విషయం మీకు తెలుసును. తెలిసికూడను దీనిని పెడమార్గం పట్టించటమనేది కేవలము అవివేకమనవచ్చును, అజ్ఞానమనవచ్చును, అహంకారమనవచ్చును. ముఖ్యముగా విద్యాసంస్థలందు యీ విధమైన ఆధ్యాత్మిక భావము క్షీణించిపోవటంచేతను, నైతిక ప్రవర్తన క్షీణించి పోవటంచేతను. ధార్మిక విచారమనేది మరచిపోవటంచేతను ప్రపంచము యిన్ని విధములైన అశాంతులకు, అల్లకల్లోలములకు అలవాలమై వుంటున్నాది. బయట ప్రపంచములో మనం వెళ్లి చూచినప్పుడు ఎంత ఘోరముగా వుంటున్నాదో

srisathyasaiwachanamrutam

విద్యాసంస్థలయొక్క పరిస్థితి. యీ విద్యయొక్క వివేకము ఎంత క్షీణించి పోయినదో, సరస్వతిని ఎన్ని విధముల గొంతు కోస్తున్నారో చెప్పటానికి వీలులేనంత యిదిగా జరుగుతున్నాది. విద్య కావాలని కోరుతూ, విద్యనభ్యసిస్తూ, ఉపకారము చేసిన విద్యాదేవతయైన సరస్వతినే గొంతు కోస్తున్నారు విద్యార్థులు. యిది ఎంత పాపకరమైనది? ఆ సరస్వతికి తగిన గౌరవము, ఆ సరస్వతికి తగిన స్థానము, ఆ సరస్వతికి తగిన హృదయము మనలో యేమాత్రము లేదు. కనుక, తగిన రీతిగా విద్యాదేవికి కృతజ్ఞతను అందించే స్వభావము విద్యార్థులలో ప్రధానమైన రీతిలో వుండాలి. మనలో శారీరక సంబంధమైన అహంకారమో లేక మానసిక సంబంధమైన అభిమానమో లేక వాక్కు సంబంధమైన అసత్యమో కొంతవరకు ప్రవేశించినప్పుడు కేవలము త్రిశంకుస్వర్గంవలె జీవించటానికి పూనుకోవచ్చును. దీనికి ఒక చక్కని ఆదర్శము.

**మంచివారినే అనేక దుఃఖములు, బాధలు, కష్టములు వెంటాడుతుంటాయి**

మహా భారతమునందు ధర్మజుడు సాక్షాత్ ధర్మస్వరూపుడే! అతనిని 5 గుణములు అనుసరిస్తూ వచ్చాయి. యివే మీరు తలంచవచ్చును, సత్య, ధర్మ, శాంతి, ప్రేమ, అహింసలని. కానీ, ధర్మజునకు అనేక విధములైన బాధలు సంభవిస్తూవచ్చాయి. మంచివారినే అనేక దుఃఖములు, బాధలు, కష్టములు వెంటాడుతుంటాయి. విలువైన డైమండ్‌కే అనేక కోతలు కోస్తారు. యీ కోతలే కోయకుండిన డైమండ్‌కు విలువ వుండదు. అదే విధముగా పరిశుద్ధమైన బంగారు. యీ బంగారును నిప్పులో వేసి, సుత్తితో కొట్టి, సాగదీసి, ముక్కలు చేసి అనేక విధములుగా వెల్డింగులు జరిపినప్పుడే ఇది సుందరమైన నగగా తయారౌతుంది. కాసిన చెట్టుకే రాళ్ల దెబ్బలు! ఐతే ఎన్ని కొట్టినప్పటికి కాచిన చెట్టు యే విధంగా వంగుతుందో. అదే విధంగా మంచి గుణములు కలిగినవాడు కేవలం వినయంగా వుంటాడు. ఏ కాయలు లేని గొడ్డుచెట్టుమాత్రమే జంబంగా నిల్చివుంటుంది. దుర్గుణములు నిండినవాడే అహంకారంగా వుంటాడు. వాని శిరస్సుగానీ, నడుముగానీ వంగదు. అయితే, అట్టి అహంకారము వున్న నడుము, శిరస్సు ఎక్కడ వంగుతాయి? మంగలివానిదగ్గర వంగుతాయి. చూశారా? అనేక వర్ష బిందువులతో చేరిన మేఘము



sri sathyasai vachanamrutam

క్రిందికి వచ్చేస్తుంది. కేవలము గాలితో నిండిన మేఘములే పైపైకి ఎగిరిపోతుంటాయి. అదే విధంగా జీవితమంతా కేవలము గాస్‌గా మాట్లాడేవాడి జీవితము పైపైన ఎగిరిపోతూ వుంటుంది. కానీ, పవిత్రమైన వచనములతో నిండిన హృదయమనే మేఘము ఎంతగానో క్రిందికి వచ్చి వినయవిధేయతలతో జీవిస్తూ వుంటుంది. ధర్మజునకు యిట్టి హృదయము వుండేటువంటిది. ఏనాడుకూడను కఠినమైన మాటలు చెప్పేవాడు కాడు. అన్ని బాధలు అనుభవిస్తూ శాంతముగా ధర్మమును అనుసరించేవాడు. దీనికి కారణము, నిరంతరము కృష్ణచింతన తప్ప అన్య చింత అతనియందు లేదు. కడపటికి కౌరవులను జయించి హస్తినాపురము హస్తమునందుంచుకొని సత్యధర్మములతోకూడిన పరిపాలన సలుపుతూ వుండిన సమయములో కృష్ణుడు తమకు దూరమై స్వస్థానమునకు చేరాడనే వార్త వచ్చింది. ఈ వార్త విన్న ధర్మజుడు తక్షణమే తమ్ములను పిల్చాడు. "కృష్ణుడులేని యీ జీవితము నాకక్కరలేదు. మనము యీ రాజ్యమును, యీ పరిపాలనను, యీ హోదాను, యీ గౌరవమును త్యజించి సర్వసంగ పరిత్యాగులమై కృష్ణమార్గము ననుసరించాల"ని నిర్ణయించుకున్నాడు. ప్రజలందరిని సమావేశపరిచాడు. "ప్రజలారా! యింతవరకు మీరు మమ్మల్ని ఎంతో ప్రేమతో గౌరవముతో మర్యాదతో చూస్తూ వచ్చారు. మేముకూడను సాధ్యమైనంతవరకు ప్రజలను ప్రేమతో బిడ్డలవలే చూస్తూ వచ్చాము. ప్రభువుకు ప్రజలు, ప్రజలకు ప్రభువు సన్నిహిత సంబంధబాంధవ్యము. అయితే, మా నిజమైన బంధువు, మిత్రుడు, సారథి, గురువు, దైవము మమ్ములను వదిలాడు. కనుక, మాకీ జీవితము అక్కరలేదు. మా భగవంతుడు లేని, మా మిత్రుడులేని, మా బంధువులేని, మా బావలేని యీ జీవితము మాకెందుకు? మమ్ములను పెంచి పెద్దచేసి, చిన్నతనంలోనే తండ్రిని పోగొట్టుకున్న మా జీవితమును యింతవరకు పోషిస్తూ వచ్చాడు, కృష్ణుడు. ఈనాడు మాస్థితిగానీ, మాగతిగానీ అన్నీకూడను అతనియొక్క ప్రసాదమే! అతని ఆజ్ఞప్రకారము మేము నడచుకున్నాము. అలా ఆజ్ఞాపించే వ్యక్తి ఇక మాకు లేదు. కనుక, యింక మేము దీనిని పాలించదల్చుకోలేదు. మా మనుమడైన పరీక్షిత్‌ను మహారాజుగా సింహాసనముపై నిలబెడుతున్నాము. ఈ చిన్న బాలుని ప్రజలే ఉద్ధరించి పోషించి, సరైన స్థితికి తెప్పించాల"ని వారికి అప్పజెప్పి ధర్మరాజు ప్రయాణమయ్యాడు.

srisathyasaivahini.org

## 'సమత్వం యోగముచ్యతే'

కొంతదూరము పోగానే అగ్నిదేవుడు ప్రత్యక్షమయ్యాడు. "ధర్మజా! ప్రాపంచిక జీవితమును గడిపే సమయమునందు శివధనుస్సుయైన గాండీవమును వరప్రసాదముగా అర్జునునకందించవలసి వచ్చింది. ఇప్పుడు మీరు సర్వసంగ పరిత్యాగులై వెడుతున్నారు. కనుక ఆ గాండీవమును వెనుకకు యిచ్చి పొమ్మన్నా"డు. అన్న ఆజ్ఞప్రకారం అర్జునుడు ఆ గాండీవము తీసి గంగలో వేశాడు. సర్వసంగ పరిత్యాగులైనవారికి యీ విధమైన ఆయుధములెందుకు? త్యజించాడు. కొంచెం దూరము పోగానే నడవలేనటువంటి ద్రౌపది అలసిపోయి క్రింద కూలింది. భీముడు గట్టిగా అరిచాడు. 'అన్నా! అన్నా! పాంచాలి క్రింద కూలింది' అన్నాడు. అప్పుడు ధర్మజుడు 'ద్రౌపది ఏనాడు ధర్మగ్లాని చేయని స్త్రీ. కానీ భీమా! ద్రౌపదిలో ఒక్క దోషము వుండటంచేత నన్ను అనుసరించే అధికారము లేక యిక్కడనే కూలిపోయింది.' అన్నాడు. ఏమిటి, ఆ లోపము? పాంచాలికి ధర్మజుడు, భీముడు, అర్జునుడు, నకులుడు, సహదేవుడు ఈ ఐదుమంది ఆమెకు సమానమైన భర్తలు. యీ విషయమును విద్యార్థులు చక్కగా అర్థము చేసుకోకుండా ఐదుమంది భర్తలేమిటి అని అనేక రకములుగా వ్యాఖ్యానము చేస్తూ వుంటారు. ఆనాటి మహా పతివ్రతయైన ద్రౌపదికి ఐదుమంది భర్తలుకాదు. పంచప్రాణములు ఆమెయొక్క పతులు. ఈ ఐదింటిని సమానంగా చూచుకోవలసిన ద్రౌపది కొంత ఎక్కువ ప్రేమ చూపించింది. అదే ఆమెలో వుండిన దోషము. అనగా, 'సమత్వములేక పోవటమే యీ విధమైన పరిస్థితికి మూలకారణము' అన్నాడు, ధర్మజుడు. 'సమత్వం యోగముచ్యతే'. అదే నిజమైన యోగము. ఏమిటి యీ సమత్వము? 'సుఖదుఃఖే సమేకృత్వా లాభా లాభౌ జయాప జయౌ' అని భగవద్గీత బోధిస్తున్నది. సుఖము దుఃఖము, heat and cold, darkness and light, pain and pleasure యివన్నీ సమంగా చూచుకోటం అనగా ఏమిటి?

## 'ధర్మో రక్షతి రక్షితః'

ఒక సమయంలో దుఃఖము వచ్చింది. సహజమే! ఒక సమయంలో ఆనందం వచ్చింది. దాని reaction యిది. ఆవిధమైన సమత్వాన్ని భావించుకొంటూ పోయినప్పుడే

srisathyasaivahini.org

హృదయానికి శాంతి చేకూరుతుందిగానీ స్వామి మాట్లాడినప్పుడు పొంగిపోవటము, స్వామి మాట్లాడనప్పుడు కృంగిపోవటము యీ విధమైన భిన్న భావములతో వుండినవారికే దుఃఖము వెంటాడుతూ వుంటుంది. స్వామి మాట్లాడటం లేదు; యిది దుఃఖానికి కారణము. ఎందుకు మాట్లాడటం లేదు? ఆ విచారణ నీకు రావాలి. 'నేను ఏ విధంగా వుంటున్నాను? నా ఆలోచనలు ఎట్లా వుంటున్నాయి? నా క్రియలు ఎట్లా వుంటున్నాయి? నా దృష్టి ఎట్లా వుంటున్నాది?' అని విచారించుకోవాలి. యివన్నీ మీలో కావలసినంత మురికి కాలువ నీరు మాదిరి నింపుకొని పవిత్రమైన నీరు చిక్కలేదే త్రాగటానికంటే ఎవరి తప్పు? నీ దురదృష్టవశాత్తు నీవు ఆ మురికి కాలువ నీరు త్రాగవలసి వస్తోంది. ఆ మురికి నీరు త్రాగటంచేతనే నీ ఆరోగ్యము చెడిపోతుంది. తద్వారా రాగద్వేషములనే రోగాలు బయలుదేరుతున్నాయి. కనుక, ద్రౌపది ధర్మమును అనుసరించకుండా పోవటానికి కారణం ఏమిటి? సమత్వము లేదు కాబట్టి ఆమె కూలిపోయింది. 'భీమా నడుచు' అన్నాడు. ఏమాత్రము విచారించలేదు. మరికొంత దూరము పోయేటప్పటికి సహదేవుడు నడవలేని పరిస్థితి వచ్చి క్రింద కూలాడు. భీముడు తిరిగి గట్టిగా అరిచాడు. 'సహదేవుడు కూలిపోయాడు,' అన్నాడు. 'నాకు మించినవాడు లేడ'నే ధీమాతో అతడు జీవితమును గడుపుతూ వచ్చాడు. 'నేనే సర్వులను, భీమ, అర్జున, నకులులను రక్షిస్తూ వచ్చినది' అని అహంకరించాడు. అనగా, ధర్మజుడుగాని అర్జునుడుగాని వారికి తాను రక్షకునిగా వుండటంచేత తనకు మేధాశక్తి ఎక్కువగా వున్నదనే ఉద్దేశ్యముతో అతను ధీమాను చూపిస్తూ వచ్చాడు. 'అదే నా వెంటరాకుండా పోవటానికి మూలకారణం' అన్నాడు. సరి అతను ప్రాణం విడిచాడు. యింకా ముందుకు పోతున్నాడు, ధర్మజుడు. కొంత దూరం పోగానే నకులుడు కూలిపోయాడు. 'అన్నా! నకులుడు కూలాడ'ని భీముడు అరిచాడు. ఎందుకంటే భీముడు మాత్రమే అరచటానికి సాధ్యమవుతుంది. అతను వాయుపుత్రుడు. అతని అరుపు వాయువులో చేరి ధర్మజునికి వినిపిస్తుంది. యింకొకరు అరచటానికి వీలుకాదు. కనుక, వాయురూపకంగా ధర్మజునకు యీ వార్తలందిస్తున్నాడని దీని అంతరార్థము. అప్పుడు ధర్మజుడు చెప్పాడు 'అతని దోషమే యిక్కడ మధ్యలో కూలిపోవటానికి కారణము.' నకులుడు మహాసౌందర్యవంతుడు. చాలా సుందరమైన వాడు. 'నాకంటే యింక

srisathyasaivahini amrutam

సుందరమైన వాడు లేడని అహంకారము అతనిలో అభివృద్ధి అయిపోయింది. ఇతను ధర్మాన్ని అనుసరించకుండా పోవటానికి యీ అహంకారమే మూలకారణము. నీవు బయలుదేరమ'న్నాడు ధర్మజుడు. యింకా కొంతదూరము పోయేటప్పటికి అర్జునుడు కూలిపోయాడు. 'అన్నా! అర్జునుడు కూలిపోయాడ'న్నాడు. 'భీమా! అతని దోషమే అతను కూలిపోవటానికి కారణమ'న్నాడు. అతని దోషము ఏమిటి? 'నా పాదములు పట్టి నాచేతిలో చేయివేసి ఒక్క దినములోపల కౌరవులను హతమారుస్తాను అని ప్రమాణము యిచ్చాడు. కానీ యిచ్చిన ప్రమాణమును తాను నెరవేర్చు కోలేకపోయాడు. కనుక ప్రమాణము యిచ్చి ఎవడు దానిని ఉల్లంఘిస్తాడో వాడికి ధర్మాన్ని అనుసరించే అధికారములేదు, నడచు' అన్నాడు. అతను కూలిపోవటానికి, ధర్మాన్ని అనుసరించకుండా వుండటానికి యిదే మూలకారణమన్నాడు. యింకా కొంతదూరం పోయేటప్పటికి భీముడు కూలిపోయాడు. అన్నా! నేను యింక నడచలేనని గట్టిగా అరిచాడు. 'సోదరా! నీ దోషమే నన్ను అనుసరించకుండాపోటానికి మూలకారణమ'న్నాడు. 'ఏమిటి నా దోషము?' అని ప్రార్థించాడు. 'తిండిపైన వున్న ప్రేమ మరొకదానిపైన లేదు. అన్నగత ప్రాణము నీది. యీ తిండితోనే దేహమును పెంచుకున్నావు. దేహబలమును, భుజబలమును, గదబలమును చూచి విఱ్ఱవీగావు. కనుక యిదే నీ దోషము. అన్నగత ప్రాణమునకు ఒక హద్దు వుంటున్నాది. తిండి వుండాలి, కానీ నీ తిండికి హద్దే లేదు. ధర్మము నీ తిండి కావాలి. అది లేనప్పుడు యివన్నీ నిన్ను రక్షించలేవు' అన్నాడు. వెనుకకు తిరిగి చూడకుండా వెడుతున్నాడు, ధర్మజుడు. కానీ ఎక్కడనుంచి వచ్చిందో యేమిటో, ఒక కుక్క అతనిని వెంటాడుతూ వుంటున్నాది. ఆ విధంగా హిమాలయ పర్వతములవైపు నడచి వెడుతుండగా అక్కడ యింద్రుడు ఒక రథమును తీసుకువచ్చాడు. 'ధర్మజా! ఆనాటినుండి నేటివరకు నీ ధర్మము ఏమాత్రము తప్పనటువంటిది. దారి తప్పక ధర్మమును అనుసరిస్తూ ఎలాంటి పరిస్థితులందైనాకూడను నీవు దానిని కాపాడుతూ వచ్చావు. గర్వము లేదు, మేధాశక్తి వున్నదనే వికారభావము లేదు. ప్రమాణము యిచ్చి నీవు మరువలేదు. సమత్వమనేది నిరంతరము నీయందు తాండవమాడుతున్నది. కేవలము తిండికోసం నీవు జీవించలేదు. నీ కోసం తిండి నాశించావు. నీ గుణములు చాలా పవిత్రమైనవి, వున్నతమైనవి. రథమునెక్కు,

వైకుంఠము వెళ్లు' అన్నాడు. ధర్మజుడు చేతులు జోడించి 'ఇంద్రా! కట్టుకున్న భార్యగానీ, తోబుట్టువులైనవారుగానీ నన్ను అనుసరించలేకపోయారు. కానీ, యీ శునకము నన్ను అనుసరిస్తూ వచ్చింది. మొట్టమొదట నన్ననుసరించిన శునకమును అందులో కూర్చోబెట్టు, తరువాత నేను కూర్చుంటాన'న్నాడు. ఈవిధంగా ధర్మజుని నోటినుండి త్యాగముతో నిండిన మాటలు వచ్చేటప్పటికి ఆ శునకము ధర్మస్వరూపమును ధరించింది. అతనే యమధర్మరాజు. ఆ యమధర్మరాజు "ధర్మజా! నీ ధర్మము కడపటివరకు యేవిధముగా వుంటుందో పరీక్ష చేయాలని నేను నీ వెంట వచ్చాను. నా పని ఏమిటి? 'ధర్మయేవ హతోహంతి' ఎవడు ధర్మాన్ని వుల్లంఘిస్తాడో వానిని హతం చేయటం. 'ధర్మో రక్షతి రక్షితః ' ఎవరు ధర్మాన్ని రక్షించారో వారిని రక్షించటం. నీవు నన్ను అనుసరిస్తూ వచ్చావు కనుక నీకు నేను సేవకుడను," అన్నాడు. తరువాత 'నీ ధర్మాన్ని లోకవ్యాప్తి గావించే నిమిత్తమై నేను నిన్ను వెంటాడుతూ వచ్చాను. కట్టకడపటికి యింత పవిత్రమైన హృదయుడవని జగత్తునకు విదితమైంది. కనుక నేను యిక వెళ్ళి వస్తాన'ని అంతర్ధానమైపోయాడు, యమధర్మరాజు.

**ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమానములే మానవదేహములోని పంచ ప్రాణములు**

ఈ ఉదంతమును కొద్దిగా లోతుకు వెళ్ళి విచారిస్తే, ఎవరు ధర్మాన్ని అనుసరించలేకపోయారు? ఎవరు స్వర్గములో ప్రవేశించలేకపోయారు? భేదభావము కలిగినవాడు, ధీమాతో వుండినవాడు, అందమును చూచి అహంకారపడేవాడు, యిచ్చిన మాట తప్పేవాడు, తిండికోసం జీవించేవాడు యీ ఐదుగురు ధర్మాన్ని అనుసరించలేరు, స్వర్గాన్ని పొందలేరు. ఈ సత్యాన్ని ప్రబోధించి ధర్మజుడు స్వర్గములో ప్రవేశించాడు. ఈ ఐదుమంది ఎవరనగా ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమానములు. కేవలము ధర్మజుడు, ద్రౌపది, వారు వీరు, అని చెప్తుతుంటే అంతా కథలమాదిరి మీరనుకుంటారు. కాదు, కాదు, మన నిజమైన చరిత్ర యిదియే! ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమాన యీ ఐదు మానవ దేహములో పంచ ప్రాణములుగా వుంటున్నాయి. దేనికి తగిన విలువ దానికి అందించాలి. కానీ, దానిని మనం అందించటం లేదు. మీ జీవితమంతయు యీ పవిత్రమైన మార్గములో ప్రవేశపెట్టినప్పుడే జగత్తునకు, సమాజమునకు ఆదర్శవంతమైన విద్యార్థులుగా

రూపొందుతారనే ఉద్దేశ్యముతోనే యీ సంస్థను మేము స్థాపించాము. పంచభూతములు పవిత్రము కావాలనుకున్నప్పుడు ఆధ్యాత్మిక మార్గమే లేకపోతే ఏమాత్రము సాధ్యముకాదు. ఆధ్యాత్మికమనేది మన జీవితముయొక్క గమ్యము, జీవితముయొక్క ధర్మము. అది+ఆత్మ. ఆత్మ అనగా ఏమిటి? కేవలము దేహముతో కూడినది జీవ ఆత్మ. సర్వదేహములందు వుండిన సమిష్టి స్వరూపమే బ్రహ్మ. సర్వజీవులందున్న చైతన్యతత్త్వాన్ని మనం చక్కగా గుర్తించాలి.

## క్రమశిక్షణ అనేది మనం ఎక్కడకు పోయినా నీడవలె మన వెంట ఉండాలి

స్వామియొక్క ఆశయాలు ఏమి? స్వామియొక్క ఆశయాలు పెద్ద ఘనమైనవిగానీ, భరించలేనివిగానీ, చేయటానికి సాధ్యము కానటువంటివిగానీ కాదు. నేను ఎప్పుడూ చెప్పేది కొన్ని విషయాలు మాత్రమే! ఒకటి, రెండు ప్రధానంగా చెబుతాను. ఎక్కువ మాటాడవద్దంటాను, దీనివల్ల ఎవరికి లాభం? నాకేమైనా సుఖమా? దానివల్ల నాకేమైనా ఫలమా? ఈ మాటలు ప్రారంభములో కొంచెం కొంచెంగా ప్రారంభమవుతాయి. పోనుపోను మరొక మార్గములో ప్రవేశిస్తాయి. ఈ మాటలవలనే క్రోధము, ద్వేషము, అసూయ, యిలాంటివన్నీ ప్రవేశిస్తున్నాయి. ఈ దుర్బుద్ధులు ఎప్పుడు ప్రవేశించినాయో అప్పుడు బాబాకు దూరమైపోతారు. మన నీడ ఏ విధంగా మనలను వదలక, వెంటాడుతుందో అదే విధంగా క్రమశిక్షణ అనేది మనం ఎక్కడకుపోయినా మన నీడవలె వెంట వుండాలి. ఏమిటి యీ క్రమశిక్షణ? మంచి నడత, మంచి పలుకు, మంచి చూపు, మంచి వినికిడి, మంచి తలపులు యివన్నీ క్రమశిక్షణలో భాగమే!. యీ ఐదు పంచకోశములకు సంబంధించిన, పంచప్రాణములకు సంబంధించిన, పంచభావములుకూడా పవిత్రము కావాలి. ఎందుకంటె యిది అన్నగత ప్రాణము. ఈనాటి మానవుడు అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయ పంచకోశములలో విజ్ఞానమయమువరకు ప్రయాణం చేయటంలేదు. యింక ఆనందము ఎట్లా ప్రాప్తిస్తుంది? అన్నమయంవరకు పోతున్నాడు. దాని తరువాత మనోమయంవరకు కొంచెం పోతున్నాడు. యిది అయిన తరువాత ఏమాత్రం అవసరంలేదు.

ప్రాణమయమువరకు పోవటంలేదు. యింక విజ్ఞానము యేరీతిగా ప్రాప్తిస్తుంది? కనుకనే అజ్ఞానము ప్రాప్తిస్తున్నాది. అజ్ఞానము ప్రవేశించేటప్పటికి ఆనందము దూరమవుతున్నాది. దుఃఖము ప్రారంభమవుతున్నాది. ప్రతి మానవుడు యీ జగత్తులో అన్నమయము, మనోమయమువరకు మాత్రమే ప్రయాణం చేస్తున్నాడు. అన్నంకావాలి; మనస్సు సంతృప్తిగా వుండాలి. ఎట్లా వుండాలి మనస్సు సంతృప్తిగా? ప్రాణతత్త్వాన్ని కొంతవరకు అర్థము చేసుకోవాలి కదా! ఏమిటి యీ ప్రాణము? ఈ ప్రాణమనేది ప్రాణదేవత. అందుకే దేవాలయములందు ప్రాణప్రతిష్ఠ అంటారు. అనగా, life principle లేకపోతే మనస్సు యేమి చేస్తుంది?

**ఆనందమనేది దివ్యత్వమునందు తప్ప అన్యముతో లభ్యము కాదు**

ఒకానొక సమయంలోపల వరుణ కుమారుడు వచ్చి 'తండ్రీ! నాకు ఆత్మజ్ఞానము కావాల'ని ప్రార్థించాడు. 'నాయనా! ఏది జీవితమునకు ప్రధానమో, ఏది జీవితమునకు సరైన గమ్యమో, దానిని నీవు తెలుసుకునిరా, తప్పక నేను జ్ఞానోపదేశము చేస్తా'నన్నాడు. 'నీవు కొన్ని దినములు ఏకాంతముగా అడవిలోకి పోయి తపస్సు చేయ'మన్నాడు. పోయినాడు. అడవిలో కూర్చున్నాడు. జీవితమునకు యేది ముఖ్యమైనది విచారణ చేసుకున్నాడు. అతని శక్తికి తగినంతగా యోచన చేశాడు, పాపం. నా జీవితము రావటానికి, నా యీ దేహానికి నా తల్లితండ్రుల ఆహారసారమే కారణము. కనుక, నా పుట్టుకకు ఆహారమే ముఖ్యము. ఈ దేహాన్ని పెంచుకోవాలంటే ఆహారమే అవసరము. దీనికి అన్నం పెట్టకపోతే యిది నశించిపోతుంది. కనుక, సృష్టి, స్థితి, లయములకంతా అన్నమే కారణమని గుర్తించుకున్నాడు. తండ్రి దగ్గరకు వచ్చాడు. 'నాన్నా! అన్నమే బ్రహ్మ' అన్నాడు. 'నాయనా! మంచిదేగానీ యిది సరికాద'న్నాడు. 'అన్నము నీ ముందు పెడతాను. నీకు తినాలని మనస్సే లేకపోతే అన్నముండి యేమి ప్రయోజనము? యిది అన్నమా లేక మట్టా అని తెలుసుకోటానికి వీలులేదే! మనస్సు లేకపోతే యిది అన్నమని నీకు ఎట్లా తెలుస్తుంది? నీవు అన్నమును తింటున్నావా లేక మట్టిని తింటున్నావా? కాబట్టి, దీనికి మనస్సు ప్రధానము. తిరిగి కనుక్కుని రమ్మన్నాడు. సరే మనస్సు ముఖ్యమని అనుకున్నాడు. అది

srisathyasaivachanamrutam

కాదు, తండ్రి చెప్పాడు. దీనికంటె వున్నతమైనది మరేమిటి? తిరిగి తపస్సు చేస్తూ వచ్చాడు. "ఓహో! దీనికి ప్రాణము చాలా ప్రధానమైనది' అనుకున్నాడు. అన్నము వుండి మనస్సు వుండి, విచారణ చేస్తూ వుండినప్పటికి, ప్రాణమే లేని జీవితము శవముతో సమానము. కనుక, తండ్రి వచ్చి 'నాయనా! ప్రాణము ప్రధానమంటున్నావు; ప్రాణము కాదు ప్రాణము సర్వత్రా వుంటున్నాది. కానీ అట్టి ప్రాణము ఒక్క దేహములో మాత్రమే ప్రవేశించింది. ప్రాణము రావచ్చు, ప్రాణము పోవచ్చు. కనుక రాకపోకలు లేని దివ్యతత్త్వమే బ్రహ్మ. అది నీవు కనుక్కొని రా", పొమ్మన్నాడు. 'అరె! ప్రాణము కాదు, ప్రాణము కాదు,' అనుకుంటూ యీ ప్రాణాన్ని చక్కగా విచారణ చేసుకుంటూ పోయాడు. విజ్ఞానమనేది యిది ప్రాణము, యిది మనస్సు, యిది అన్నము, యిది జీవితము అనేది తెలుపుతున్నాది. విజ్ఞానము లేకపోతే యివన్నీ నిరుపయోగమనుకున్నాడు. తిరిగి తండ్రి దగ్గరకు వచ్చి 'నాన్నా! విజ్ఞానమే బ్రహ్మ' అన్నాడు. అప్పుడు తండ్రి తిరిగి 'పిచ్చివాడా! విజ్ఞానము కల్గినవారు ఎన్ని వేలమంది లేరు! దేశములో ఎన్ని కోట్లమంది లేరు! విచక్షణాజ్ఞానమే విజ్ఞానమనుకుంటున్నారు. యిట్టి విజ్ఞానవంతులు ఎంతమందో వుంటున్నారు', అన్నాడు.

ఆ విజ్ఞానముచేత ఎంత గొప్ప గొప్ప పనులు చేస్తున్నారు! న్యూటన్ వుంటున్నాడు. ఐన్స్టీన్ వుంటున్నాడు. వీళ్లంతా గొప్ప విజ్ఞానవేత్తలే! ఈ విజ్ఞానమనేది వుండికూడా, యిది ఆనందమునందించటంలేదే! విజ్ఞానవంతులకందరికి ఎక్కువ విచారమే తప్ప ఆనందమే లేదు. ఒక చిన్న ఉదాహరణము. ఐన్స్టీన్ చాలా గొప్ప విజ్ఞానవేత్త. అతని భార్యకు ఏబిసిడిలుకూడా రావు. చాలా మొరటు మనిషి. యింక న్యూటన్కూడను గొప్ప విజ్ఞానవేత్త. భూమికి ఆకర్షణశక్తి వున్నదని తెలుసుకున్న మొట్టమొదటివాడు అతను. ఆయన నిరంతరము విచారణ చేస్తూ వుండేవాడు. ఈ న్యూటన్యొక్క తత్వము ఎంతో గొప్పది. కానీ అతని భార్య మహాగయ్యాళి. ఆ గయ్యాళితో యీయన బాధలు పడుతున్నాడు. ఒక రూమ్కి పోతాడు, తలుపులు వేసుకుంటాడు, రాత్రింబవలు ఆ విచారణలోనే వుంటాడు. అతనికి ఆనందమే లేదు. యిక్కడ సమత్వాన్ని భావించుకుంటూ రావాలి. ఐన్స్టీన్ దగ్గరకు వచ్చి ఎవరో చెప్పారు. 'మీరు యింత గొప్ప విజ్ఞానవేత్తలు కదా, మీ భార్యకు కొంతవరకైనా విద్య నేర్పించలేదే' అన్నారు. 'యిదికూడను నాకు ఒక వుపకారమే'నన్నాడు. 'ఆమెకూడను గొప్ప



sri sathyasaivaachaamrutam

విద్యావంతురాలైవుంటే ఆమె ఒక రూములో పోయి కూర్చునేది. నేను ఒక రూములో పోయి కూర్చుండేవాడిని. మాకు తిండిపెట్టేవారు లేకుండావుండేవారు. విద్యరాకుండా పోవటం నాకు ఒక వుపకారమే'నన్నాడు. ఈవిధంగా విజ్ఞానవేత్తలకుకూడా ఎంతో అశాంతి లోపల వుంటున్నాది. కనుక, విజ్ఞానము ఆనందమునందించలేదు. తిరిగి ఆ ఆనందమునకు మూలకారణమేమిటో కనుక్కోమని పంపించాడు, తండ్రి. పోయాడు, కూర్చున్నాడు. ఆనందమును తలచుకుంటూ తలచుకుంటూ వెళ్లాడు. తిరిగి వెనుకకు రాలేదు. రెండు దినములు, మూడు దినములు, ఒక వారము, పదహైదు దినములు, నెలరోజులు, చూచాడు తండ్రి. తిరిగి వెతుక్కుంటూ వెళ్లాడు. కూర్చున్నాడు. ఆనందముతో వుంటున్నాడు కుమారుడు. 'నాయనా! ఎందుకు నీవు యింటికి రాలేదని' ప్రశ్నించాడు. 'ఆనందములో వుండిన వానికి ఏది అక్కరలేదు. ఆనందమునకు ఆనందమే ముఖ్యము. ఈ ఆనందమెక్కడ వుంటున్నాదని' ప్రశ్నించాడు, వరుణుడు. తండ్రి, 'దైవమే ఆనందము, దివ్యత్వమే ఆనందము. ఆ పవిత్రమే ఆనందము, త్యాగమే ఆనందము. అద్వైతమే ఆనందము', అని యీవిధంగా ఒకదానికొకటి చెప్పుకుంటూ వచ్చాడు. చివరకు 'ఇదే ఆనందమన్నాడు. అప్పుడు వరుణుడు

**నిత్యానందం పరమసుఖదం కేవలం జ్ఞానమూర్తిం**
**ద్వంద్వాతీతం గగనసదృశం తత్త్వమస్యాది లక్ష్యం**
**ఏకం నిత్యం విమలమచలం సర్వధీసాక్షిభూతం**
**భావాతీతం త్రిగుణ రహితం ....**

అని వర్ణించాడు.

## విద్యతోబాటు నిత్యజీవితమునకు అవసరమైన కొన్ని ప్రక్రియలుకూడా నేర్చుకోవాలి

ఆనందమనేది ఏవిధంగా వస్తుంది? ఒక్క దైవత్వములో తప్ప అన్యముతో మనకు లభ్యము కాదు. యీనాటి విద్యార్థులు ముఖ్యంగా 'విద్యను ఎందుకోసం అభ్యసిస్తున్నాము,' అని ప్రశ్న వేసుకోవాలి. నిత్య జీవితంలో సుఖంగా వుండటం కోసమంటారు. సుఖమంటే ఏమిటి? 'కడుపునిండుకు తిండి, కంటినిండుకు నిద్ర,



srisathyasaivachanamrutam

ఒంటినిండుకు బట్ట, యింటినిండుకు పిల్లలు, యిదే నా సుఖమ'ంటారు. కానీ, యివన్నీ వున్నవారు సుఖపడుతున్నారా? లేదు. యింక దేనికోసం మన విద్య? యీ విద్యకూడా తాత్కాలికంగా సుఖాన్ని అందిస్తుంది. యింకా కొంతమంది 'ఏ డిగ్రీ తీసుకుంటే ఏ ఉద్యోగము లభిస్తుంది, ఏ ఉద్యోగములో ఎంతవరకు మనకు జీతము వస్తుంది,' అని ప్లానులు వేసుకుంటూ పోతారు. ఈ విధమైన లౌకిక ఫలితముల నిమిత్తమై విద్యనభ్యసించటం ప్రారంభమైనప్పటినుండి విద్యా విధానములో వివేకముగానీ, ఆనందముకానీ లేకుండాపోతున్నాది. ఈ విద్యతో బాటు నిత్యజీవితమునకు అవసరమైన కొన్ని ప్రక్రియలుకూడను నేర్చుకోవాలి. గృహవైద్యాలుకూడను మనం నేర్చుకోవాలి. Awareness is life. కేవలము ఒక సబ్జక్టుపైన, ఒక ఉద్యోగము మనము చేసి, దాని వలన మనం సుఖం పొందుతామన్నది చాలా పొరపాటు. ఈ awareness అనేది ఒక్క భగవంతునినుంచితప్ప మిగతా దానిలో మనకు లభ్యముకాదు. ఒక చిన్న ఉదాహరణము.

**నిత్యజీవితములో దుఃఖాన్ని నివారించే సాధన దైవ ప్రార్థన ఒక్కటే!**

ఒక MBA విద్యార్థి చక్కగా గోల్డ్ మెడలు తీసుకున్నాడు. MBA లో 1st class 'O' grade. యింకొక అమ్మాయి M.Sc. లోపల 1st class 'O' grade వచ్చి ఆమెకూడను గోల్డ్ మెడలు తీసుకుంది. ఈ డిగ్రీలు పూర్తి అయిపోతూనే అమ్మాయి ఉద్యోగం చేసింది, అబ్బాయి ఉద్యోగం చేశాడు. అదృష్టవశాత్తు యిద్దరూ ఒకే ఆఫీసులో పనిచేస్తూవుండటంచేత యిద్దరికి స్నేహం ప్రారంభమైంది. పెండ్లి చేసుకున్నారు. ఒక సంవత్సరమో రెండు సంవత్సరములో అయిన తరువాత బిడ్డ పుట్టింది. బిడ్డ పుట్టేటప్పటికి చాలా ఆనందించారు. పెండ్లి అయింది, ఆనందంగానే వుంటున్నాది. బిడ్డ పుట్టింది, ఆనందంగానే వుంటున్నాది. కానీ ఆ బిడ్డకు కొన్ని దినాలలోపల దగ్గు, పడిశం వచ్చింది. ఆ బిడ్డకు తీవ్రమైన జ్వరం వచ్చేటప్పటికి చాలా కంగారుపడిపోతున్నాది, యీ తల్లి. తీవ్రమైన జ్వరం వుందని ఆఫీసులో వున్న భర్తను కంగారు పెట్టింది. యిద్దరు కంగారుతో వచ్చి బిడ్డను చూచారు. తల్లితండ్రుల కంగారును చూచి ఆ బిడ్డకూడా కంగారుపడిపోయింది. యీ యిద్దరు చేరి ఆ బిడ్డను తీసుకుపోయి

డాక్టరు దగ్గర పెట్టారు. వీరి కంగారును చూచాడు డాక్టరు. కొంచెం ఎక్కువగా డబ్బు డిమాండు చేశాడు. ఏమో యోచించినట్లుగా నటించి 'ఏమిటి? మీరింత లేటు చేశారు? జ్వరం చాలా ఎక్కువై పోయింది' అని యింకా డబ్బులు లాగే విధానాన్ని ప్రారంభించాడు. 'ఒక వారం రోజులు నర్సింగ్‌హోమ్‌లో పెట్టాలి' అన్నాడు. ఈ విధంగా ఒక వారం నర్సింగ్‌హోమ్‌లో పెట్టేటప్పటికి యిద్దరికి వచ్చిన జీతమంతా ఖర్చైపోయింది. బిడ్డ బాగుందని తిరిగి యింటికి తీసుకెళ్లారు. విచారం ప్రారంభమైంది, 'వచ్చే నెల ఏ విధంగా గడపాలి' అని. యీ విధంగా వుండేటప్పటికి మళ్ళీ బిడ్డకు జ్వరం వచ్చేసింది. తిరిగి హాస్పిటలుకు తీసుకెళ్లారు. యీ విధంగా జబ్బురావటం, హాస్పిటల్‌కు పోవటం, ఖర్చు కావటం, యీ విధంగా నాలుగైదు పర్యాయములు బిడ్డను ఆసుపత్రికి తీసుకుపోయేటప్పటికి భర్తకు విసుగు పుట్టిపోయింది. 'యీ తూరి జ్వరం వస్తే హాస్పిటల్‌కు తీసుకుపోకూడదు' అనుకుని తిరుపతి వేంకటరమణుడు బోడి చేసినట్లుగా వీడు మనల్ని బోడి చేస్తున్నాడని, వీడు చస్తే చావనీ, వీడిని యింక డాక్టరు దగ్గరకు తీసుకుపోకూడదని విసుగువచ్చేసింది. ఉద్యోగం చిక్కింది, జీతాలు వచ్చినాయి, పెండ్లి చేసుకున్నారు, బిడ్డ పుట్టింది. కానీ, ఆనందము లేదు, విసుగు. యీ బిడ్డపైనకూడా విసుగుపుట్టిపోయింది. తరువాత ఎండాకాలం వచ్చింది. ఎండవలన వడదెబ్బ వచ్చింది. ఆ వడదెబ్బవలన బిడ్డ మరణించింది. తదుపరి వీరనుకున్నారు, 'యికపైన మనకు బిడ్డలే వద్దు' అని. యీ విధంగా చదువుకున్నంత మాత్రమున సుఖం లేదు. అమ్మాయి M.Sc.1st class చేసింది. సైన్సులో వుత్తీర్ణురాలైపోయింది. కానీ, ఏ చదువులు తన దుఃఖమును నివారణ చేయలేదు. యింక యీ MBA చదివిన పిల్లవాడు environment, communication, banking, finance, computer అన్నీ చదివాడు. అన్నింటిలోను మంచి మార్కులొచ్చాయి. కానీ యింటిలోపల మాత్రం దుఃఖముగా వుంటున్నాది. ఏ కంప్యూటర్ నా దుఃఖమును ఎందుకు నివారణ చేయకూడదని అడుగుతున్నాడు. కంప్యూటర్ గానీ, కమ్యూనికేషన్ గానీ, బ్యాంకింగ్ గానీ ఇవన్నీ దుఃఖమును ఏమైనా నివారణ చేస్తున్నవా? లేదు. నిత్య జీవితములో దుఃఖాన్ని నివారణ గావించే మార్గము ఒక్క దైవప్రార్థన తప్ప అన్యము లేదు. కనుక, దైవత్వమును మనం విశ్వసించాలి. 'యిదంతా కేవలము విజ్ఞానముతో లభిస్తున్నాదని,

srisathyasaivachanamrutam

లేకపోతే తన ప్రజ్ఞతో లభిస్తున్నాది, విద్యలతో లభిస్తున్నాద'ని అనుకోటం పొరపాటు. యింతకంటే గొప్ప అజ్ఞానం మరొకటి లేదు.

విద్యలవల్ల యీ జగత్తులో యేమాత్రము సుఖములేదు. యీ విద్యలతోపాటు ఆధ్యాత్మికమునుకూడా అనుసరించినప్పుడే మీకు సుఖాన్ని అందిస్తుంది. యీ అధ్యాత్మికములోపల general knowledge కూడా పెరుగుతుంది. GK లేనివానికి ఎన్ని చదువులు చదివి ప్రయోజనం లేదు. మీకు తెలుసును, కామావధాని అని వున్నాడు. గొప్ప అవధాని అతను. గొప్ప వేదపండితుడు. ఆయన 24 గంటలు వేదమును వల్లె వేస్తుంటాడు. ఎప్పుడు అదే చింతన పాపం అతనికి. ఆయన చదివినంత వేదం యీ భారతదేశములో మరెవ్వరు చదవలేదు. 'ఘనాపాటీ' అనే గొప్ప బిరుదును పొందాడు. తెల్లవారి లేచినది మొదలు రాత్రి నిద్రించేంతవరకు వల్లె వేస్తూనే వుంటాడు. ఆ వేదము తప్ప మరొకటి ఆయనకు తెలియదు. GK జీరో. GK లేనప్పుడు ప్రపంచములో యేవిధముగా జీవించటానికి వీలవుతుంది? నాలుగు, ఏడు ఎంత అంటే తొమ్మిది అంటాడు. అంతమాత్రము కూడా తెలియదతనికి. కనుక GK చాలా అవసరం.

**ప్రపంచములోని సంపదలన్నిటికంటే మనిషియే అత్యంత విలువైనవాడు**

ఈనాడు పిల్లవానికి జ్వరం వచ్చింది. పాతకాలములో ఎట్లా వుండేదంటే శొంఠి, అల్లము, ధనియాలు, మిరియాలు, అన్ని కాల్చి దాని రసమును తాపించేస్తే ఒక్క దినములోపల యీ దగ్గు, పడిశము నివారణ అయ్యేటువంటిది. ఈ వడదెబ్బకుకూడా చక్కని వైద్యము వుంటున్నాది. ఒక్క క్షణములో నివారణ అయిపోతుంది. ఒక ఉల్లిపాయ అడ్డముకోసేది, దానికి దారం కట్టి మెడలో కట్టివేస్తే వడదెబ్బ తగ్గిపోతుంది. ఆ వాసనచేత యీ వడదెబ్బ తగ్గిపోతుంది. మనం ప్రయాణము చేసే సమయంలో ఉల్లిపాయను కోసి జేబులో పెట్టుకొని పోతుంటే మనకు వడదెబ్బ తగలదు. యిలాంటి గృహవైద్యాలు ఎన్నో వుంటున్నాయి. ఈనాటి ఆధునిక విద్యావంతులంతా యిదంతా మొరటు వైద్యం, పాతకాలం రోతకాలమని అలక్ష్యం చేయటంవలననే ఆధునిక విద్యార్థులంతా అనేక కష్టాలకు, దుఃఖాలకు గురైపోతున్నారు. కానీ, విద్యార్థులు గుర్తించవలసినది 'Old is gold'

sri sathyasai vachanamrutam

అని. గోల్డువల్ల జగత్తుకు ఉపకారమంటూ యేమీలేదు. ధనవంతులకేమైనా బాగుండవచ్చుగానీ పేదవారికి దీనివల్ల వుపయోగమేమీలేదు. కనుక, గోల్డు విలువ కాదు, డైమండు విలువ కాదు, భూములు విలువ కాదు. యీ భూములు ఎవరు సాగు చేస్తున్నారు? ప్రజలే చేస్తున్నారు. డైమండును ఎవరు కొంటున్నారు? మానవులే కొంటున్నారు. బంగారునెవరు కొంటున్నారు? మానవుడే కొంటున్నాడు. మానవుడే లేక బంగారుకు విలువలేదు. మానవుడే లేక డైమండుకు విలువలేదు. మానవుడు లేక భూమికికూడా విలువలేదు. కనుక, men are more valuable than all the wealth అని మనిషి చాలా విలువైనవాడు. ఆ విలువను మనం కనుక్కోవాలి. మనిషి అని, మనిషి అనుకొని మనం కుక్కలవలె, నక్కలవలె జీవిస్తుంటే మన జీవితము మనుష్యత్వము ఎట్లా అవుతుంది చెప్పండి?

**మానవత్వమును పెంచుకునే దివ్యత్వము నాశ్రయించాలి**

ఈ చదువువల్ల మానవత్వాన్ని మనం అభివృద్ధి గావించుకోలేము. దినదినానికి మానవత్వము దిగజారిపోతున్నాదేగాని అభివృద్ధి కావటములేదు. కనుక, మానవత్వమును పెంచుకునే దివ్యత్వమును మనము ఆశ్రయించాలి. విద్యార్థులారా! స్వామికి ఎప్పుడూ ఆనందమే! స్వామి ఆశించినది ఒక్కటే! యీ విద్యాసంస్థయందు ఉత్తీర్ణులైన విద్యార్థులు బయట ప్రపంచములోకి పోయి తగిన ఆదర్శమునందిస్తారు, తద్వారా లోకము ఎంతో బాగుపడుతుంది, అని నేను ఆశ పెట్టుకున్నాను. కానీ ఆ ఆశకు తగినంత తృప్తి లేకపోవటంచేత అదే స్వామికి అసంతృప్తి. అంతేతప్ప, స్వామికి మీపైన కోపంగానీ, మీపైన కష్టముగానీ, ఏమాత్రం లేదు. ఆశించిన రీతిగా యీ పిల్లలు అభివృద్ధిలోనికి రాలేకపోతున్నారే, వీరి భవిష్యత్తు యేమైపోతుందో, వీరి భవిష్యత్తు ఎన్ని విధములైన కష్టాలకు గురౌతుందో అనేటువంటి బాధనే స్వామికి. ఈ MBA కోర్సును ప్రారంభించినప్పుడు, ఒక్కొక్క ఫ్యాక్టరీలో వేలమంది వుంటుంటారు, మా MBA పిల్లలు ఆ ఫ్యాక్టరీకి పోయి చేరినారంటే ఎంతమందినైనా మార్చగలరు, అని ఎంతో ఆశించాను. విద్యార్థులు బయట గొప్పలు చెప్పుకోవచ్చునేగాని నిజంగా యిక్కడనుంచి పోయిన MBA పిల్లలు యే విధంగా వున్నారో నాకు మాత్రమే తెలుసు.

srisathyasaivachanamrutam

యిక్కడ మేనేజరు, అక్కడ మేనేజరు అని చెప్పుకోవడమేగాని ఎవ్వరికి యింతవరకు మేనేజరు పదవి యివ్వలేదు, యే ఫ్యాక్టరీలోను. కారణం ఏమిటి? వీరిలో ఎంతో ఆధ్యాత్మికము వున్నదని వారు ఎంతో విశ్వసించారు. తీరా అక్కడకు పోయేటప్పటికి వీరి ప్రవర్తన వేరు రీతిగా వుండింది. 'వీడు అంతా గ్యాసుకొడుతున్నాడు. విద్య వుండవచ్చుగానీ తగినంత వినయ విధేయతలు లేకుండా వుంటున్నాడ'ని ఎవరూ మేనేజరు పని యివ్వటం లేదు. ఎవరు ఏది చెప్పినా 'I know this' అని అహంకారంగా ప్రవర్తిస్తున్నారేతప్ప, వినయ విధేయతలతో వారు ప్రవర్తించటంలేదు. అందువలన వారిని యిక్కడనుంచి అక్కడకు, అక్కడనుంచి యిక్కడకు మార్చేస్తూ వస్తున్నారు. ప్రాపంచిక సంబంధమైన ప్లానులే వేస్తుంటారు. ఎక్కడికి వెళ్ళినప్పటికి భక్తి అనేది ఒకటి వుంటుంటే ఎంతైనా అది మిమ్మల్ని అభివృద్ధిపరుస్తుంది. అది లేక ఎంత గొప్పవాడవని నీవు అనుకున్నప్పటికిని ఫలితము లేదు. అంతకంటె చిల్లరితనము మరొకటి లేదు. అంతకంటె లోభత్వము మరొకటి లేదు. నీ పనియందు నీవు చదివిన విద్యలుకూడను ఉపయోగించుకో! తప్పులేదు. ఉదాహరణకు వీరు ఫ్యాక్టరీలో ఒక దగ్గరకు పోతారు. ఎవరో వర్కరు అక్కడ మిషన్‌దగ్గర పనిచేస్తుంటాడు. వీడు పోయి తాను చదివినదంతా ఆ వర్కరును ప్రశ్నలు వేసి విసిగిస్తూ అడుగుతూ వుంటుంటే వాడు చిరునవ్వు నవ్వుతాడు. 'సార్! 20 ఏండ్లనుంచి నాకు యీ మిషనుమీద అనుభవము వుంటున్నాది. నిన్న ప్యాసై వచ్చిన మీకు యేమి తెలుసు సార్,' అంటాడు. వానిది personal experience నీది bookish knowledge. యీ రెండింటికి అక్కడ పొత్తు కుదరదు. యింతే కాకుండా యింకోటి విద్యార్థులు గుర్తించాలి. యిక్కడ చదివిన చదువులకు, మీరు బయటకు పోయి చేసే ఉద్యోగాలకు సంబంధమే లేదు. మన టీచర్సుకూడను అది గొప్ప, యిది గొప్ప అని చెపుతుంటారు. యివన్నీ వట్టి గ్యాస్. వారు చదివినది వారు చెపుతున్నారు. కానీ అక్కడ పనిచేసే సమయంలో ఏ ఒక్కటి అక్కడ పనికి రావటంలేదు. నేను కూడా చాలా విచారించాను. చాలాకాలంనుండి పనిచేస్తున్న క్లర్కులను పిలిచి వారితో మీటింగు పెడుతున్నారుగాని మన MBA pass చేసిన క్రొత్త పిల్లవానిని ఆ మీటింగులో చేర్చటంలేదు. ఎందుకంటే వీడు వట్టి మాటలతో కాలం గడుపుతున్నాడు. పని చెయ్యాలి. ప్యాసైన ప్రతి పిల్లవాడు ఫ్యాక్టరీలో చేరినప్పుడు ఆ ఫ్యాక్టరీనంతా పూర్తిగా అధ్యయనం చేయాలి. ప్రతి చిన్నపనిని నేర్చుకోవాలి. కనుక, ఒక 6

sri sathyasai vachanamrutam

నెలలు నీవు చేరిన ఫ్యాక్టరీలో నీవు విద్యార్థి కావాలి. కానీ వీడు అక్కడ విద్యార్థి కావటం లేదు, మేనేజరు. ఏసీ రూములో కూర్చోటానికి ప్రయత్నం చేస్తాడు. వాడు ఏసీ రూములో కూర్చుంటుంటే వీడి బుద్ధంతా **gas** లా బయటకు పోతుంటాది. ఏమీ ప్రయోజనం లేదు. కష్టపడాలి. 'కర్మణ్యేవ అధికారస్తే.' కర్మయందు నాకు అధికారము. నేను కర్మను ఆచరించాలి. నడుము వంచి పని చెయ్యాలి అని నిర్ణయించుకోవాలి. యీనాడు మన విద్యార్థులు ఎవరూ నడుము వంచి పని చేయటంలేదు. నీటుగా డ్రస్సు వేసుకోటం, చక్కగా స్టైలుగా తిరగటము; యితరులతో పని చేయించటము; యిది సరైన మేనేజ్మెంటు లక్షణమే కాదు.

**తెలిసినదానిని ఆచరణలో పెట్టినవాడే ఉత్తముడు; పెట్టనివాడే అధముడు**

విద్యార్థులు చేయవలసినది యిదికాదు. మనము చేసి వారికి చూపించాలి. అప్పుడే యిది ఆదర్శము. అప్పుడే మన పిల్లలను అందరూ ఆకర్షిస్తారు. ఏదో బయట వున్నవారికంటె better అని చెప్తున్నారేగానీ మనము అట్లా better తో పోకూడదు. Better అనే మాట రాకూడదు, best గా రావాలి. అందువల్లనే 'తెలిసి చేయనివాడికంటె మూర్ఖుడు మరొకడు లేడు,' అన్నారు. తెలిసినదానిని ఆచరణలో పెట్టినవాడే best man. తెలిసినదానిని ఆచరణలో పెట్టనివాడే worst man. ఇందుకు రెండు ఉదాహరణలు. భీష్మాచార్యుడు, విభీషణుడు. భీష్మాచార్యునికంటె విభీషణుడు ఉత్తముడన్నారు. 'ఏమిటిరా! భీష్ముడు మహాజ్ఞానికదా, గాంగేయుడుకదా, త్యాగములోపల అతనిని మించినవారు లేరుకదా! యావజ్జీవము త్యాగము చేశాడుకదా! అతనికి మించిన అస్త్రశస్త్రవిద్యలు మరెవరికీ తెలియదు. అలాంటి గొప్పవానికంటె రాక్షసుడుగా పుట్టిన విభీషణుడు ఎట్లా గొప్పవాడు?' అని తర్కం వేసుకుంటారు. నిజమే, భీష్ముడు గొప్పవాడే! మహాజ్ఞానియే! గొప్ప వేదాంతే! సర్వశస్త్ర అస్త్రవిద్యలు నేర్చిన మహాఘనుడే! కానీ, కౌరవ మహాసభలోపల పాండవులను, ద్రౌపదిని పరాభవము చేస్తుంటే యిది తప్పని చెప్పి ఆ దుర్మార్గమును అరికట్టలేని బలహీనుడైపోయాడు. యిది తప్పు అని తెలిసినప్పుడు ఎందుకు అరికట్టడానికి ప్రయత్నం చెయ్యకూడదు? దురభిమానము ఇందుకు కారణము. 'కౌరవులయొక్క కొలువులో పని చేస్తున్నాను కదా!' అనే అభిమానముకోసం లొంగిపోయాడు. కానీ, విభీషణుడు అట్లా కాదు.

srisathyasaivachanamrutam

అన్న చేసిన పని తప్పని తెలిసినప్పుడు నచ్చచెప్పటానికి ఎంతో ప్రయత్నం చేశాడు. వాడు ఒప్పుకోటంలేదని చివరకు అన్ననుకూడా త్యాగం చేసి రాముని పాదం పట్టాడు. తప్పును ఎవరు నిరూపిస్తారో వాడే నిజమైన గురువు. కానీ దానిని పిల్లలు యిష్టపడటంలేదు. మన దోషాలు యేమైనా చెబితే 'బుస్' అని వుంటారు. వెనుకనే కూర్చుంటారు. ముందుకు రారు. వెనుక వెనుక కూర్చుంటున్నారంటే వారియొక్క guilty conscience అనేది తప్పక తెలుస్తుంది. వారిలో గొప్ప దోషాలు వుండటంచేతనే ఆ విధంగా ప్రవర్తిస్తారు.

**మాట నిలబెట్టుకున్నవాడే నిజమైన మనిషి**

అంతే కాకుండా, స్వామి వారితో మాట్లాడకుండా పోవటానికి కారణం ఏమిటీ? అనికూడా విచారించుకోవటంలేదు. క్రమశిక్షణగా ఎప్పుడూ నడచుకోటం లేదు. పోనీ చెప్పిన మాటైనా దక్కించుకుంటున్నారా? అదీ లేదు. అలా మాటను పాడు చేసుకున్నవారు మూగవానితో సమానమే! వానితో నేను యేమి మాట్లాడాలి? మాటను వ్యర్థం చేసుకోటానికి నాకు యిష్టంలేదు. మాటను నిలబెట్టుకున్నవాడే నిజమైన మనిషి. మాటను నిలబెట్టుకోలేనివాడు కేవలము మృగమనే చెప్పవచ్చును. మృగమైనా మేలు. ఎందుకంటే ఒక కుక్కకు యింత అన్నం పెట్టామంటే మనము మర్చిపోయినప్పటికి ఆ కుక్క మనలను చూస్తూనే తోక అల్లాడించుకుంటూ మన దగ్గరకు వస్తుంది. యిక్కడ భోజనం, బట్టలు, విద్య అన్నీ యిచ్చి పిల్లలను తల్లితండ్రులకంటె ఎక్కువ సదుపాయములు చేసి పెంచి పెద్దచేస్తే వీళ్లకి gratitude లేకపోతే విద్య ఎందుకోసం? యిది విద్య అంటారా, అవిద్య అంటారా? కేవలం పొట్టకూటికోసం పాటుపడుతున్నారే తప్ప ఆదర్శవంతమైన జీవితంకోసం పాటుపడటంలేదు.

ఒక గాడిద, ఒక కుక్కకూడా వుపకారం చేసున్నాయి, యజమానికి. ఒక చిన్న ఉదాహరణము. ఒక చాకలివాని యింట్లో గాడిద, కుక్క వుంటున్నాయి. ఎందుకంటే చాకలి అందరి బట్టలు తీసుకువచ్చి అక్కడ యింట్లో వేస్తాడు. దాన్ని కాపాడేకోసం కుక్క ఒకటి వుంటుంది. ఏవిధంగా కాపాడుతుంది? ఎవరైనా వస్తే అరుస్తుంది. అప్పుడు చాకలి బయటకు రావచ్చు. గాడిద ఎందుకోసమంటే యీ బట్టలనంతా తాను మోసుకుపోలేడు. ఆ

sri sathyasai vachanamrutam

గాడిదపైన వేసి చాకిరేవుకి తీసుకొనిపోతాడు. కనుక, వాని పెద్ద ఆస్తి ఏమిటంటే ఒక కుక్క మరియు ఒక గాడిద. వాటిపైన బాధ్యతవేసి హాయిగా వుంటాడు, పాపం! కుక్క అరచినప్పుడు తలుపు తెరుచుకుని బయటకు వస్తాడు. అప్పుడు దొంగలను పట్టవచ్చు అన్న నమ్మకంతో వుండేవాడు, పాపం! ఆ కుక్క, గాడిద అంత విశ్వాసంగా వుండేవి. ఒకనాడు ఏమైంది? యింటికి బంధువులొచ్చారు. వంటలంతా వండి అంతా ఖర్చైపోయింది. కుక్కకు యింత అన్నం పెట్టలేకపోయాడు, పాపం. అది చాలా బలహీనంగా వుంటున్నాది. ఆనాటి రాత్రి ఒక గుంత త్రవ్వుకొని ఆ గుంతలో పడుకుని వుంది. ఏమీ శక్తి లేకుండా వుంటున్నాది. ఎవరైనా వస్తే అరవటానికికూడా శక్తిలేదు. ఆనాటి రాత్రి దొంగలొచ్చారు. కుక్క అరవలేదు. కుక్కకు అన్నం పెట్టలేదు కాబట్టి దానికి అరవటానికి శక్తిలేదు. ఇక, గాడిదకుకూడా యింత గడ్డి వేయడు వీడు. అది బజారులోని కాగితాలను తినుకుంటూ పోతుంటాది, పాపం! కానీ విశ్వాసం పెట్టుకొని వుంటున్నాది. దొంగలొస్తే కుక్క అరవలేదని గాడిద అరచింది పాపం! యజమానికి సహాయము చేయాలని. ఈ గాడిద ఎక్కువగా అరిచేకొద్దీ ఆ చాకలికి నిద్రపట్టక బయటకు వచ్చేశాడు. చూచారా ఈ కుక్కకు, గాడిదకుకూడా యజమానిపైన వున్న విశ్వాసము ఎంత గొప్పది! యీనాడు మృగములకైనా విశ్వాసము వుంటున్నాది గాని మనుష్యులకు వుండటంలేదు. యిలాంటి gratitude లేనివారు జగత్తుకు యేమి వుపయోగము, ఉపకారము?

**చెడ్డమాటలు మాట్లాడకండి, చెడ్డమాటలు వినకండి!**

మీరందరు మంచివారే! అయితే, ఇంకా కొంచెం మంచిగుణాలను పెంచుకోండి! 'స్వామికి తృప్తి అయ్యే విషయాలు ఏమిటి?' అని విచారణ చేసి మంచిగా నడచుకోండి! మీరు మంచి పేరు తెచ్చుకోండి, అదే నాకు చాలు. మీరు బయటకు పోయి ఏ చెడ్డ పేరు తెచ్చుకుంటారో, MBA పిల్లలు యే ఫ్యాక్టరీకి పోయి అల్లర్లో చిక్కుకుంటారోనని నాకు చాలా భయం. ఇప్పుడు ఎక్కడకు పోయినా ఫ్యాక్టరీలలోపల చాలా అల్లర్లుగా వుంటున్నాది. 'నేను MBA ప్యాసయి గోల్డు మెడలు తీసుకున్నాను' అని అక్కడకు పోయి ఆ అల్లర్లలో చిక్కుకుపోకుండా చూచుకోండి. మంచి పలుకులు నేర్చుకోండి. మంచి

sri sathyasai vahanamrutam

చూపులు చూచుకోండి. ఎవ్వరూ లేరు కాబట్టి నేను చెబుతున్నాను. యీ ఫ్యాక్టరీలలోపల పనిచేసే వారిలో ఆడవారు, మగవారు, పిల్లలు, పెద్దలు, అన్ని రకములవారు వుంటుంటారు. మొట్టమొదట మీరు మంచి దృష్టిని పెంచుకోండి! ఒక్కొక్క ఫ్యాక్టరీలోపల భార్యాభర్తలు యిద్దరూ పని చేస్తుంటారు. మీ దృష్టి ఆ అమ్మాయిమీద పడిందంటే, వాడికి నచ్చదు. జాగ్రత్తగా వుండండి! అంతే కాకుండా యింకొకడు వచ్చి చెడ్డమాటలు చెబుతున్నాడంటే, వాని మాటలు నీవు వింటున్నావంటే, రెండవవాడు నీ పైన కన్ను వేస్తాడు. కనుక, చెడ్డ మాటలు వినకండి, చెడ్డ చూపులు చూడకండి, చెడ్డ చింత చేయకండి, చెడ్డ పనులు చేయకండి, చెడ్డ మాటలు మాట్లాడకండి! మీకు బాగా తెలుసును. రామాయణమంతా యిదే నేర్పుతూ వచ్చింది. కైక ఎవరు? దశరథమహారాజుకు పట్టపురాణి. ఆమెకోసము సర్వస్వము త్యాగము చేశాడు, దశరథ మహారాజు. ఆమె గొప్ప రాజు బిడ్డ. కాశ్మీరు రాజకుమార్తె. గొప్ప ఉన్నతస్థాయిలో వున్న కుటుంబాలు. కానీ, ఆమె వెంట ఒక చెలికత్తె వచ్చింది. ఆమె పని మనిషి. ఆమె పేరు మంథర. పనిమనిషి అయినప్పటికిని ఆమెపైన చాలా ప్రేమగా వుండేటువంటిది, కైక. ఒకనాడు కౌసల్యరూమునుండి కైక రూముకు వెడుతున్నాది యీ మంథర. రామలక్ష్మణభరతశత్రుఘ్నులు బంతి ఆట ఆడుకుంటున్నారు. రాముడు విసిరాడు. యీ సమయములోపలే మంథర బిర్రున అడ్డం వచ్చింది. బంతి దెబ్బ తగిలింది, పాపం! ఆ ద్వేషాన్ని మనసులో పెట్టుకుంది. చూశారా! ద్వేషం ఎంత పని చేసింది! సమయము వచ్చినప్పుడు యీ రామునికి శిక్షనివ్వాలని ఒక ప్రతిజ్ఞ చేసుకుంది. భరతశత్రుఘ్నులు కాశ్మీరులో వుండినప్పుడు దశరథ మహారాజు రామునికి పట్టాభిషేకము అని నిర్ణయించుకుంటున్నాడు. మాష్టరు ప్లాను వేసుకుంటున్నాది, యీ లోపల మంథర. అప్పుడు తిరిగి కైక దగ్గరకు వెళ్లి 'అమ్మా! రాములకు పట్టాభిషేకము చేయటానికి నిర్ణయించుకున్నాడు దశరథుడు', అనింది. సహజంగా, మంచి పెద్ద కుటుంబమునుండి వచ్చిన కైకకు గొప్ప భావము వచ్చేసింది. 'మంథరా! యింత పవిత్రమైన వార్తను నేను వినగలిగాను', అని ఆ సమయంలో తాను వేసుకున్న పెద్ద వజ్రాలహారము తీసి మంథర మెడలో వేసింది, బహుమతిగా. ఆమె యీ హారము తీసిపారవేసి, రోషము నూరి నూరి

sri sathyasai vachanamrutam

పోసింది, కైకకు. 'ఏమిటంత పిచ్చిదానివి? రాముడు చక్రవర్తి అయిపోతాడు. కౌసల్యకు నీవు దాసిగా వుండాలి?' అని చెప్పి చెప్పి దుర్బోధలు చేసేసి ఆమె మనస్సును మార్చేసింది. చెడుమాటలు మొట్టమొదట రుచిగా లేకపోయినా నిరంతరము చెబుతూ, చెబుతూ వుంటే అవి తలకెక్కిపోతాయి.

**మంచిమాట వినరు మనసిచ్చి చెప్పిన**
**చెడ్డమాట ముందు చెవిని పడును**
**ఇట్టివారు నన్ను ఎరుగంగనేర్తురే**
**ఎట్టి తెలివియున్న ఏమి ఫలము?**

చెడ్డమాటలు చెప్పింది మందర. చెడ్డమాటలు వినింది కైక. దశరథుని ప్లానుకు అడ్డం తిరిగింది. రాములను అరణ్యమునకు పంపించింది. కొడుకు పట్టాభిషేకము కావాలని కోరింది. అప్పుడు అయోధ్యాపురవాసులందరుకూడను ఎవరిని తిట్టారు? కైక, మంథరలను తిట్టారు. 'ఈ మంథర ఎంత చెడ్డ మనిషి', అని ఆమెను చివాట్లు పెట్టారు. దేనివల్ల? చెడ్డమాటలు చెప్పటంవల్ల మంథర చెడ్డదైపోయింది. చెడ్డమాటలు వినటంచేత కైక చెడ్డదైపోయింది. కనుక ప్రపంచమంతా వీరిద్దరిని ద్వేషించారు. ఈనాడు ఆడవారిలో ఎవరైన 'మంథర', 'కైక' అని పేరు పెట్టుకుంటున్నారా? మీ అత్తలో అమ్మలో చెల్లెండ్రో పెట్టుకున్నారా? చెప్పండి. లేదు, ఎవరు పెట్టుకోరు ఆ పేర్లు. ఎక్కడకూడా మీరు విని వుండరు. సామాన్యమైన మానవులు ఎవరూ పెట్టుకోరు. ఎందుకు నేను అంటున్నానంటే వారిని విమర్శించటం కాదు. 'లంఖిణి' అని, 'శూర్పణఖ' అని పేర్లున్నాయి. చెడ్డమాటలు చెప్పటం, చెడ్డమాటలు వినటంచేత వీరి పేర్లు సమాజం దూరం చేసేసింది.

**చెడ్డచూపు గలవారిని సమాజము దూరంగా పెడుతుంది**

12 సంవత్సరములు అరణ్యవాసం సల్పి ఒక సంవత్సరము అజ్ఞాతవాసంలో వుంటున్నారు పాండవులు. అక్కడ పేరు, వూరు తెలియకుండా వుండాలని మారు వేషాలతో వుంటున్నారు. ఎంత మారు వేషాలు వేసుకున్నప్పటికి వారి తేజస్సు ఎక్కడకు పోతుంది? ఆ తేజస్సు ఎప్పుడూ వుంటూవుంటుంది.

srisathyasaivachanamrutam

**పెద్ద వజ్రమొకటి పెంటలో దొరికిన**
**విలువ మారదు దాని వెలుగు పోదు**

కడిగి దానిని దాచి పెట్టుకుంటారుగానీ దానిని వదలరు.

**గొప్ప నెమలి గ్రుడ్డు కోడి తాపొదిగిన**
**వన్నె మారదు దాని చిన్నెపోదు**
**పెద్ద గుమ్మడిపండు కంచెలో దాచిన**
**రుచి మారదు చెడిపోదు**

అదే విధముగా గొప్పవారి తేజస్సు ఎక్కడికి పోయినప్పటికీ మారదు. చెడ్డవారికి ఎంత ప్రయత్నించినప్పటికి ఆ తేజస్సు రానేరాదు. ద్రౌపది, విరాటరాజు కొలువులోపల మారు వేషములో వుంటున్నది. రాణిగారికి సేవ చేస్తున్నాది. ఆ రాణి తమ్ముడు ఒకడుంటున్నాడు. వాని పేరు కీచకుడు. వాని దృష్టి ద్రౌపదిపైన పడింది. ఎప్పుడు వాని దృష్టి యీమెపైన పడిందో భీముడు చూచాడు. వెనక పోయినాడు. గదతో తలముక్కలు చేసేశాడు. యీనాడు విద్యార్థులలో 99% కీచకులే! చెడు దృష్టి చాలా జాస్తి. ఏ భీముడో వచ్చి మీ తలలు పగలగొడతాడు. జాగ్రత్తగా వుండండి. ఏనాటికో ఒకనాటికి, యీనాడు కాకపోయినా రేపటికైనా, యీ ఫలితం తప్పినది కాదు. దీనిని దృష్టిలో పెట్టుకోండి. మగవారిలో ఎవరైనకూడను కీచకుడనే పేరు పెట్టుకున్నారా? కారణం ఏమిటి? చెడ్డ చూపు గలవాడు కాబట్టి, సమాజమే వానిని నెట్టివేసింది. నిరంతరము చెడు ఆలోచనలు. ఎప్పుడూ పరులను దూషించటం, పరులను నిందించటము, పరులపైన చెడ్డ చెప్పటం. ఎవరు? మీ brother దుర్యోధనుడు. ధర్మమూర్తులైన పాండవులపైన అనవసరమైన మాటలు. మీరుకూడా అంతే! మంచివారిపైన ఎన్నెన్నో పిచ్చి పిచ్చి పదాలు వుపయోగపెడుతుంటారు. కాబట్టి, మీరుకూడను ఆ దుర్యోధనుని తోబుట్టువులే! ఆ దుర్యోధనుడు చెడ్డ తలంపులు చేయటంచేత ఏమైంది? కట్టకడపటికి వంశాన్నే నాశనం చేసుకున్నాడు. కౌరవుల వంశ నాశనానికి మూలకారణం యీ దుర్యోధనుడే. కనుక, ఎవరైనా దుర్యోధనుని పేరు పెట్టుకున్నారా? లేదు లేదు.

sri sathyasai vachanamrutam

యింక, చెడ్డపనులు చేసిన మహావీరుడు ఒకడున్నాడు. గొప్ప విద్యావంతుడు. అతనికి మించిన విద్యావంతుడు జగత్తులోనే లేడు. 64 విద్యలు నేర్చినవాడు. స్వర్గమును మరపించే పెద్ద పట్టణం కట్టుకున్నాడు. ఎవరూ అతనిని ఎదిరించేవారే లేరు. అంత శక్తిమంతుడు. ఎవరు? రావణాసురుడు. చూశారా! రావణాసురుడు-గొప్పవాడు. పరస్త్రీని అపహరించటంచేత కట్టకడపటికి తనకేమి గతి పట్టింది? చెడ్డ పనులు చేస్తూ వచ్చాడు. ఎక్కడ స్త్రీలను చూస్తే వారినంతా ఎత్తుకుపోవటం. ఎంతమందినో అక్కడ చేర్చాడు, పాపం! ఆ పాపఫలం ఎక్కడకు పోతుంది? కట్టకడపటికి దైవమే అతనిని శిక్షించాడు. ఎంత శక్తి వుండి యేమి ప్రయోజనము? ఎంత చదువుండి యేమి ప్రయోజనము? ఎంత బంధుమిత్రులుండి ఏమి ప్రయోజనం? ఎంత ధనకనకవస్తువాహనాదులుండి ఏమి ప్రయోజనం? మనము చేసే పని సరిలేకుండా వున్నప్పుడు అది విరుద్ధముగా మారిపోతుంది. యిట్లాంటి చెడ్డ పనులు చేసినవారి పేరు ఎవరైనా పెట్టుకుంటున్నారా, రావాణాసురుడని? రామబ్రహ్మం వుంటున్నాడుగానీ, రావణబ్రహ్మం లేడు.

**నేను కోరేది పంచేంద్రియములను అదుపులో పెట్టుకోమనే!**

చెడ్డ పలుకులు పలికినవాడు, చెడ్డ తలంపులు తలచినవాడు, చెడ్డ మాటలు చెప్పేవాడు. చెడ్డ దృష్టికలిగినవాడు, చెడ్డపనులు చేసేవాడు వీరిని సమాజము యీ జగత్తులో ఒప్పుకోదు. కనుక, యీ పంచేంద్రియములను కొంచెం అదుపులో పెట్టుకోండి. నేను కోరేది అదే! ఈ విధంగా వుండినప్పుడే మన Institute పేరు, మన పిల్లల పేరు చక్కగా అభివృద్ధి పొందుతుంది. దేశమంతా మిమ్ములను పొగడుతుంది. మీరు మంచిగా వుంటే మన Institute కి మంచి పేరు వస్తుంది. ఆ విషయాన్ని మీరు మనస్సులో పెట్టుకోండి! స్వామి ఏది చెప్పినా మీ మంచికోసమేగానీ నాకోసం కాదు. నాకు మీనుంచి వచ్చేది యేమీ లేదు. ప్రపంచమంతా నా చేతిలో వుంది. ప్రపంచమంతా వస్తుంది. కాని, నేను ఏదీ, ఎవరినీ కోరటం లేదు. మంచి పేరు తెచ్చుకోండి! యిక్కడకు వచ్చినందుకు మంచి బుద్ధులు పెట్టుకోండి! భగవంతుని అనుగ్రహమునకు పాత్రులుకండి! అదొక్కటి వుంటే సర్వమును సాధించవచ్చు. అనుగ్రహానికి పాత్రులుకాక ఆగ్రహానికి గురయితే యేమి ప్రయోజనం

sri sathyasai vahanamrutam

చెప్పండి? యింతకంటె నీచమైన జన్మ మరొకటి వుండదు. అనుగ్రహానికి నోచుకోండి, ఆగ్రహమునకు పాత్రులు కాకండి! తప్పుదారి పట్టకండి, మంచిభావాలు పెంచుకోండి! చదువులు లేకపోయినా ఫరవాలేదు. మీమీ సబ్జక్ట్సులో మీమీ ప్రొఫెసర్సు అంతాకూడను 'O' grade యిస్తారు. కానీ నా సబ్జక్టులో ప్యాసైతేనే నిజమైన 'O' grade. నా సబ్జక్టులో 'O' grade తెచ్చుకోండి, యింక అన్ని సబ్జక్ట్సులోను మీకు 'O' grade తప్పక వస్తుంది. యిదీ జీరో, అదీ జీరో. నా దగ్గరకూడా తీసుకుంటారు జీరో. ఆ ప్రొఫెసర్సు యిచ్చేది జీరో. కానీ అక్కడ పదములు మార్చినారు. అక్కడ 'O' grade అన్నారు. యిక్కడ జీరో గ్రేడు అన్నారు. ఆకారము ఒక్కటే. నా దగ్గరకూడను 'O' grade తెచ్చుకోండి, నేను రెడీగా వున్నాను, యివ్వటానికి. కాని మీరు రెడీగా లేరు, తీసుకోవటానికి. మీరు మంచిగా వుండండి. ఒకటి కాదు ఎన్ని జీరోలు అయినా యిస్తాను, నేను. నా దగ్గర జీరో అంటే పెద్ద గుండ్రముగా వున్న సున్న. ప్రపంచమంతా గుండ్రము. స్వామి దగ్గర 'O' grade తీసుకుంటే ప్రపంచమంతా 'O' grade యిస్తుంది.

పిల్లలకు యింకొకటి చెప్పాలి. B.A., B.Sc. IIIrd yr గానీ, M.A., M.Sc., MBA IInd yr గానీ వచ్చేటప్పటికి యీ పిల్లలకు యేమి పుడుతున్నాదో యేమోగానీ శ్రద్ధాభక్తులు తగ్గిపోతున్నాయి. కారణం ఏమిటి? 'యీ సంవత్సరము ఒకటే కదా వుండేది ఇక్కడ, రేపటి సంవత్సరము వుండము కదా' అని. యీ విధమైన అలక్ష్యము చేయటంచేతనే మహాపాపం మిమ్మల్ని వెంటాడుతున్నది. అసలు మీకు యింకొక రకం ఫీలింగ్ రావాలి; 'ఇది IIIrd yr, యింక నేను వెళ్లిపోతాను; యిది IInd yr, వెళ్లిపోతాను' అనే బాధతో మంచి ఫీలింగ్ రావాలి. 'ఎట్లా స్వామిని విడిచి పెట్టి వెళ్లేది,' అని ఆ విధమైన attachment వుండాలి. One month, one month అని ఆనందపడుతుంటారు. యిది, ఆనందముకాదు, మహాపాపము. దుఃఖము ముందు వెంటాడుతుంది. మంచి సంగమును వదలి పోవుటకు ఎంత విచారంగా వుండాలి? కానీ, మీలో అది లేదు. దుస్సంగములో చేరటానికి ఉత్సాహపడుతున్నారు. యీ క్రమశిక్షణ గానీ, యీ కాలేజి నిబంధనలుగానీ, యీ హాస్టలు నిబంధనలుగానీ, ఒక్కటీ బయట ప్రపంచములో వుండవు. మీ యిష్ట ప్రకారము వుండవచ్చు, చేయవచ్చు, అని భావిస్తున్నారు. అంతకంటే పశువు జీవితం మేలు కదా! యిది కాదు freedom. నిజమైన

srisathyasaivachanamrutam

freedom మంచిని బోధించేది, మంచిని నేర్పేది, జీవితాన్ని మంచిగా తీర్చి దిద్దేదీను. యిదే చక్కని ఆదర్శము. కుక్కలుకూడా బజారున పడి తిరుగుతాయి. అక్కడకు పోయి అంత ఆయాసపడి తిరగటంవలన ఏమి ప్రయోజనం? కుక్కలతో సమానం. యిండ్లకుకూడా సరిగా రారు. బయట తిరిగి తిరిగి ఎక్కడో ఒక కుక్క మాదిరి హోటల్‌లోనో, స్నేహితుని యింటిలోనో తిని, స్నేహితుని యింటిలో కుక్క మాదిరి పడివుంటారు. యిదా మన విద్యయొక్క విలువ? యిదా విద్యయొక్క గౌరవము? ఛీ!ఛీ! ఎవరి దగ్గరా మనం బానిసలం కాకూడదు, ఒక్క భగవంతునికి తప్ప. ఒక స్నేహితునితో వాడింటికి భోజనానికి పోతాడు. నీ స్నేహితుడు గౌరవంగా 'రారా! బ్రదర్' అంటాడు. ఆ స్నేహితుని తల్లితండ్రులు ఏవిధంగా వుంటారు లోపల? 'ఎవడురా దరిద్రుడు! వీనివెంట తిరుగుతున్నాడు. మేము వండుకున్నది వీనికి పెట్టవలెనా?' అని లోపల తిట్టుకుంటారు. అలాంటి చెడ్డభావాలు వారికి రాకుండా ఉండాలంటే ఎవరింటికి మనం పోకూడదు. చాలామంది పిల్లలంతే! ఒక దినము, రెండు దినములు స్నేహితుల యింట్లో కూర్చోటం యీ రకంగా పోతుంటారు. యింతే కాదు, మీరు బాగా జ్ఞాపకం పెట్టుకోండి! ఆ స్నేహితుల యింట్లో వారి చెల్లెళ్లు అంతా వుంటుంటారు. ఆ విధంగా చాలావరకు చెడ్డపేరు తెచ్చుకుంటున్నారు. యిలాంటివి మాత్రం రాకుండా చూచుకోండి! నేను యీ పొద్దు వివరించి చెబుతున్నాను. మొదట స్నేహితునితోపాటు వారింటికి వెళ్లి కూర్చుండి పోతాడు, తరువాత స్నేహితుడు లేని సమయంలో పోతాడు. ఫలితంగా పిచ్చి పిచ్చి ఆలోచనలు అంతా పెరుగుతున్నాయి. ఇది చాలా అన్యాయం. యీ విధంగా చెడ్డపేరు తెచ్చుకుంటున్నారు. అలాంటి చెడ్డపేరును మాత్రం తెచ్చుకోకండి!

**మనస్సు ఎప్పుడూ పవిత్రమైనదే!**

స్వామియొక్క బోధలు ఎలాంటి రత్నాలో మీకు తెలియదు. ఈ విధంగా తల్లితండ్రులుకూడా చెప్పరు. నేను యింత చిన్న చిన్న విషయములుకూడను ఎంతో గొప్పగా చెబుతున్నాను. యివన్నీ మీ మంచికోసమే, నాకోసం కాదు. ఈ సత్యాన్ని గుర్తించి వర్తించండి. మీరు మంచి ఆదర్శవంతమైన విద్యార్థులుగా తయారై భారతదేశానికి యింకా ఎంతో విలువను సంపాయిస్తారు. చెడ్డ మనస్సు అనుకుంటున్నారు. చెడ్డమనసు అనేదే

sri sathyasaivachanamrutam

లేదు. చెడ్డ దృష్టి, చెడ్డ శ్రవణంచేతను చెడ్డ మనస్సు వస్తున్నది. కనుక మనస్సు ఎప్పుడూ చెడ్డది కాదు. యిది తెల్లగా వుంటున్నాది (రుమాలువలె) దీనీ స్వభావమే తెలుపు. తుడుచుకుని పెట్టటం వలన డర్టీగా మారిపోతున్నాది. అదే రీతిగా మైండ్ ఎప్పుడూ ప్యూరే. నీ చెడ్డ దృష్టివల్ల, చెడ్డ వాక్కువల్ల, చెడ్డ శ్రవణంవల్ల, చెడ్డ తలంపులవల్ల, చెడ్డ క్రియలవల్ల, ఆ మైండు గలీజు అయిపోతున్నాది. డర్టీగా మారిపోతున్నాది. మనస్సు ఎప్పుడూ పవిత్రమే! 'మంచిగా ఎట్లా మార్చుకోవాలి,' అని అడిగాడు ఒక అబ్బాయి. మార్చుకోనక్కరలేదు. పంచేంద్రియములను అదుపులో పెట్టుకుంటే మనసెప్పుడూ మంచిగా వుంటుంది. నీవు చెడ్డను చూస్తివా, అప్పుడు భగవంతుని స్మరించుకో! అప్పుడు ఆ చెడ్డ సంహారమవుతుంది. చెడ్డను చూస్తివా, కండ్లు మూసుకో. భగవంతుని స్మరించు. దానిని నీవు చిత్రించుకో. చెడ్డ మాటలను యేమైనా వింటివా, తక్షణమే మంచి మాటలను జ్ఞాపకం తెచ్చుకో. యీ విధంగా చెడ్డవున్నప్పుడు మంచిని పెంచుకుంటే చెడ్డ దానిపాటికదే పోతుంది. చెడ్డవాసన వుంటున్నాది. దానిని దూరం చేయి. లేకపోతే మంచి సువాసనను పెంచుకో! ఎక్కడైనా చెడ్డగా వుంటే మనం ఊదొత్తిని ముట్టిస్తాం. ఎందుకోసం? ఆ చెడ్డ వుండినా యేమాత్రం బాధించకుండా యీ సుగంధము చేస్తుంది. నీవు మంచిని తలంచు. చెడ్డ 'యింకేమి, యింకేమి,' అని వినకుండా మంచిని తలంచుకుంటూ రా! పిల్లలలో ఆ విశాల భావం లేదు. ఎవరైనా చెడ్డ చెబితే యింకా పదిమంది చేరుతారు. యీ విధంగా ఒకదానికొకటి పదిమంది జాయింటు అయితే కుక్కలే! చిన్న ఉదాహరణము చెప్పి నా ఉపన్యాసం ముగిస్తాను.

**త్యాగము చేసి మంచిని పొందండి**

ఒక వెన్నెల రాత్రి ఒక కుక్క పరుగెత్తి, పరుగెత్తి ఒక చోట పడుకోవాలని చూచింది. పండుకునేటప్పుడు దాని స్వభావరీత్యా చుట్టు తిరిగి తిరిగి ఎక్కడ గాలి వస్తుందో అక్కడ ముక్కును పెట్టి పండుకుంటుంది. అది తిరుగుతుంటే దాని నీడకూడా తిరుగుతూ వచ్చింది. ఆ నీడను చూచి అది ఒక కుక్కగా భావించుకుంది, పాపం! దాన్ని చూచి యిది మొరుగుతూ వచ్చింది. ఎందుకు మొరిగిందది? తన నీడను చూచి మొరిగింది. తన నీడ చూచి ఒక కుక్క మొరిగితే ఊర్లో కుక్కలన్నీ మొరిగినాయి. యిది కుక్కల సహజ స్వభావం. ఎందుకోసం ఆ

srisathyasaivachanamrutam

కుక్క మొరుగుతున్నాది? యింకొక కుక్కకు తెలియదు. ఒక కుక్క మొరిగిందా, మిగిలిన కుక్కలు అన్నీ మొరుగుతాయి. ఇది సాధారణంగా పల్లెలలో జరుగుతూ వుంటుంది. టౌన్సులోకూడా! యిక్కడ తన guilty conscience ను చూచి తాను కొంతవరకు ఉద్రేకపడతాడు. తన నీడను చూచి తాను మొరుగుతాడు. మిగతా కుక్కలన్నీ దేనికి, యేమిటని discrimination లేదు. అవికూడా మొరుగుతూ కూర్చుంటాయి. యిది గ్రుడ్డితనము కాదా? ఇది వాని దోషము, వాని తప్పు అని మనం వానిని మందలించాలి గానీ దాన్నిబట్టి మీరుకూడా అరచటానికి మొదలు పెడితే యేమైనా అర్థం వుంటున్నాదా చెప్పండి? యింక మన విజ్ఞానం ఉండి ఏమి ప్రయోజనం? మంచిని అనుసరించరు, చెడ్డను మాత్రం అనుసరిస్తారు. ఎక్కడైనా సరే, ఎవరైనా సరే, చెడు సహవాసమును దూరం చేసుకోండి. దానిలో మీరు చేరకండి. ఎవరైనా చెడ్డమాటలు మాట్లాడేటప్పుడు get out అని కొట్టి వేయండి. ఇది నీ మంచికే! యింకా ఏమైనా మితిమీరి మాట్లాడుతే బాగా చక్కగా చురుకుగా ఒక దెబ్బ వేయండి. యింకోతూరి మాట్లాడడు. అదీ నిజమైన సాత్త్విక అభివృద్ధి. చెడ్డను చూచి ఎంతైనా ద్వేషం చేసుకోవచ్చు, మంచిని చూసి సర్వస్వము త్యాగం చేయవచ్చు. కనుక, త్యాగము చేసి మంచిని పొందండి. చెడ్డకు సర్వస్వము యిచ్చి వదలండి. ఎందుకంటే కంపెనీనిబట్టి యివన్నీ జరుగుతుంటాయి.

**నాలుక యిచ్చినందుకు భగవన్నామస్మరణతో నాలుకను పవిత్రం చేసుకోండి!**

ఒక్కడెవడైనా మన హాస్టలులో తప్పు చేస్తే అందరికి చెడ్డ పేరు వచ్చేస్తుంది. పిల్లలు అనుకుంటారు, 'ఎవరో ఒకడు తప్పు చేస్తే మన అందరికి punishment' అని. కాని, ఇది తప్పింది కాదు. ఎందుకంటే సంగదోషము. మనకు రాత్రిపూట పడుకున్నప్పుడు దోమ కుట్టింది. రాత్రంతా నిద్రలేకుండా కుట్టిందని రెండవరోజు ఫ్లిట్ తీసుకొని కొట్టేస్తాము. కుట్టిన ఒక్క దోమనే కాకుండా చుట్టూ ఉన్న అనేక నూర్ల దోమలను చంపివేస్తాము. కారణం ఏమిటి? నిన్ను కుట్టిన దానిని ఎక్కడ వెదికేందుకౌతుంది? యివన్నీ ఒకే గుంపులో వున్నాయి. కాబట్టి, యీనాడు కాకపోయినా రేపైనా కుడుతుందని అన్నింటినీ చంపవలసిందే! ఆ విధంగానే మీకు punishment వస్తుందాది. చాలా మంది మంచి పిల్లలు

వుంటున్నారు. కానీ, చెడ్డవారితో స్నేహం చేయటంవలన వీరికి యీ దురవస్థ వచ్చేసింది. కనుక మీకు మీరు ఎప్పుడూ మంచిగా వుంటుండండి. చెడ్డను దూరం చేసుకోండి. మంచిని పెంచుకోండి. గొప్ప పేరు సంపాయించండి. సాయి ఆశయాలు నిలబెట్టండి. సంతోషం.

మీరు భోజన ప్రియులేగాని, భజన ప్రియులు కారు. నిజంగా భజన ప్రియులైతే యిట్లా మారతారా మీరు? ఎప్పటికీ మారరు. చాలామంది భజన చేయటంలేదు. నోరుకూడా కదిలించరు. నేను చూస్తున్నా. నాలుక యిచ్చినందుకు పవిత్రం చేసుకోండి! పిల్లలను నేను కనిపెట్టాను. మన విద్యాసంస్థలో వుండినప్పుడు యీ ప్రాప్తి మన జీవితములో చిక్కింది. ఒక్కతూరైనా మనము భగవన్నామస్మరణ చేస్తామని యోచన చేసుకోవాలి. యిలాంటి అవకాశము బయట చిక్కదు.

**(తేదీ 05-03-1992న ఇన్స్టిట్యూట్ ఆడిటోరియంలో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam